ANN తెలుగు

Follow: @ANNTELUGU

11-04-2025

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 130 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## మళ్లీ సీఎస్‌కే కెప్టెన్‌గా ధోనీ

### తలా కమ్ బ్యాక్.. చెన్నై ఫ్యాన్స్ ఆనందం

మహా: ఐపీఎల్ ఫ్రాంఛైజీ చెన్నై సూపర్‌కింగ్స్‌కు కెప్టెన్‌గా మళ్లీ మహేంద్రసింగ్ ధోనీనే వ్యవహరించనున్నాడు. ప్రస్తుత కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ మోచేయికి గాయమైంది. దీంతో ఈ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లకు అతడు దూరం కానున్నాడు. ఈ నేపథ్యంలో సీఎస్కే యాజమాన్యం జట్టు సారథ్య బాధ్యతలను ధోనీకి అప్పగించింది. "కెప్టెన్సీ విషయంలో మా జట్టుకు చాలా తక్కువ ఆప్షన్స్ ఉన్నాయి. మేము ఎవరినీ లక్ష్యంగా పెట్టుకోలేదు. ధోని బాధ్యతలు స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాడు". అని ఫ్లెమింగ్ అన్నారు. సీజన్ ప్రారంభంలో గౌహతి వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గైక్వాడ్ కుడి మోచేతికి గాయం అయింది. గైక్వాడ్ మోచేయి ఎముక విరిగినట్టు సమాచారం. దీంతో శుక్రవారం కోల్‌కతా నైట్ రైడర్స్‌తో చెన్నై సూపర్ కింగ్స్ తలపడబోయే మ్యాచ్ తో ధోనీ కెప్టెన్సీ ప్రారంభమవుతుంది. ధోనీ చివరిసారిగా ఐపీఎల్ 2023 ఫైనల్ కు కెప్టెన్‌గా ఉన్నాడు. గుజరాత్ టైటాన్స్ తో జరిగిన ఫైనల్లో ధోనీ సారథ్యంలో చెన్నై టైటిల్ గెలుచుకుంది. 2024 ఐపీఎల్ సీజన్ కు ముందు కెప్టెన్సీ నుంచి తప్పుకున్న మహేంద్రుడు..అప్పటి నుంచి ప్లేయర్ గా మాత్రమే కొనసాగుతాగున్నాడు.

**టాప్ న్యూస్**

### హరీశ్‌రావుది వన్‌సైడ్ లవ్..



- ఆయన కళ్ళుండీ చూడలేకపోతున్నారు
- ఎంపీ చామల కిరణ్ కుమార్

02

### ఢిల్లీకి చేరిన.. 26/11 ముంబై దాడుల సూత్రధారి



- 16 ఏళ్ల తర్వాత భారత్‌కు
- రాణా రాకతో ముంబై దాడి కేసు కొలిక్కి

07

### ఉప ప్రధానిగా నితీష్ కుమార్?



- బీహార్ సీఎం పదవిపై బీజేపీ కన్ను

02



# యంగ్ ఇండియా నా బ్రాండ్



## మహాత్మా గాంధీ నాకు స్ఫూర్తి

### అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ఏర్పాటు

## పీవీ అందరికీ దార్శనికుడు

### అధిక జనాభా ఉన్న దేశంలో ఒలంపిక్స్ లో ఒక బంగారు పతకం కూడా రాలేదు

### యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

**మహా :** యంగ్ ఇండియా తన బ్రాండ్ అని, మహాత్మా గాంధీ స్ఫూర్తితో ఇది ప్రారంభించినట్లు సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గండిపేట మండలం నార్సింగి మున్సిపల్ పరిధిలోని మంచిరేవులలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ను మంత్రి శ్రీధర్ బాబు, డీజీపీ జితేందర్, ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి, శాసనమండలి విప్ మహేందర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ చైర్మన్ తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ఖాకీ డ్రెస్ వేసుకున్న హోంగార్డు నుంచి డీజీపీ స్థాయి వరకు ప్రతి పోలీసు పిల్లలు యంగ్ ఇండియా పోలీస్ స్కూల్లో చదువుకోవచ్చు అన్నారు. పోలీసు శాఖపై తనకు ప్రత్యేక అవగాహన ఉందన్నారు. మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ బిజిలీ, పానీ, సడక్ అనే నినాదంతో ముందుకు సాగినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ప్రముఖ యూనివర్సిటీలకు జవహర్ లాల్ నెహ్రూ బీజం వేశారన్నారు. పీవీ మన దేశ ప్రజలందరికీ దార్శనికుడు అని కొనియాడారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ గిరిజనులు, ఆదివాసులు, ఇతర అన్ని వర్గాల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు.

మిగతా 2లో

## రంగంలోకి సుప్రీం కమిటీ

### 400 ఎకరాల భూముల పరిశీలన

### కమిటీని కలిసిన బీఆర్ఎస్, బీజేపీ ప్రతినిధి బృందాలు





**హైదరాబాద్, మహా:** వివాదం రేపిన కంచ గచ్చిబౌలిలోని భూములను సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సాధికారక కమిటీ పరిశీలించింది. కమిటీ ఛైర్మన్ సిద్ధాంత దాస్, సభ్యులు సీపీ గోయల్, సునీల్ లిమాయే, చంద్రదత్ దాదాపు గంటపాటు 400 ఎకరాల స్థలంలో కలియ తిరిగి అక్కడి పరిస్థితులను రికార్డు చేశారు. HCU విద్యార్థులతోనూ కమిటీ సమావేశమైంది. విద్యార్థులు కంచ గచ్చిబౌలి భూముల్లోని క్షేత్రస్థాయి పరిస్థితులను వివరిస్తూ రూపొందించిన నివేదికను కమిటీకి అందజేశారు. కంచ గచ్చిబౌలి భూముల పరిశీలన అనంతరం సుప్రీంకోర్టు సాధికారక కమిటీ ఛైర్మన్, సభ్యులు తాజ్ కృష్ణా హోటల్‌కు వెళ్లారు.


మిగతా 2లో

### భద్రాచలం ఠాణాపై

## ఏసీబీ దాడి

### లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సీఐ గన్ మెన్

**భద్రాచలం మహా:** పోలీసు ఠాణాలోనే లంచం తీసుకుంటుండగా ఎసిబి పట్టుకుంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ సంఘటన సంచలనం సృష్టించింది. సీఐ గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న రామారావు అనే కానిస్టేబుల్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఘటన స్థానికంగా సంచలనం రేపింది.



మిగతా 2లో

### కేంద్రం ఇచ్చేది దొడ్డు బియ్యమే..సన్న బియ్యం


## ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే

### 20 శాతం అదనపు వ్యయంతో అందరికీ సన్న బియ్యం



- దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పి కొట్టాలి
- అర్హులైన వారందరికీ తెల్ల రేషన్ కార్డులు
- ధాన్యం దిగుబడిలో తెలంగాణా రికార్డ్
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

03



### మాజీ ఎమ్మెల్యే షకీల్ అరెస్ట్

- శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో అదుపులోకి
- కొంతకాలంగా దుబాయ్‌లోనే ఉంటున్న షకీల్
- రోడ్డు ప్రమాదం కేసు నుంచి కొడుకును తప్పించేందుకు ప్లాన్

వివరాలు 3లో

## రామగుండం సమీపంలో పొంచి ఉన్న భూకంపం?

### ఈ వారంలో ఎప్పుడైనా రావొచ్చు

### రిక్టర్ స్కేలుపై 5.3 తీవ్రత?.. అలర్ట్ గా ఉండాలంటున్న ఎపిక్



**హైదరాబాద్, మహా:** ఓ వైపు వరుస భూకంప వార్తల నేపథ్యంలో తెలంగాణలోనూ ఓ భూకంప హెచ్చరిక అలర్ట్ గా ఉండాలన్న సంకేతాలు పంపుతోంది. తెలంగాణలోని ములుగు సమీపంలో ఇటీవల భూకంపం సంభవించిన సంగతి తెలిసిందే.

మిగతా 2లో



### ఈనెల 17న జేఈఈ మెయిన్ ఫలితాలు

**మహా :** జేఈఈ మెయిన్ ఫలితాలు ఈ నెల 17న విడుదల కానున్నాయి. సెషన్2 పేపర్ 1 బీఈ, బీటెక్ పరీక్షలు మంగళవారంతో ముగియగా, పేపర్2,బీఆర్క్, బీ ప్లానింగ్‌పరీక్ష బుధవారంతో ముగిసాయి. మొదటి సెషన్ ఫలితాలు ఫిబ్రవరిలో విడుదల కాగా, రెండో సెషన్ ఫలితాలు ఈ నెల 17న విడుదలకానున్నాయి. అదే రోజు నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్ రిజిస్ట్రేషన్ ప్రారంభమవుతుంది. మే 18న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు 2.5 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉంది.

### మేం రిపోర్టర్లం మమ్మల్నే టోల్ అడుగుతావా

### టోల్ సిబ్బందిపై దుండగుల దాడి

**మహా :** టోల్ ఫీజు కట్టమని అడిగినందుకు టోల్ సిబ్బందిపై దుండగులు దాడికి తెగబడ్డారు. 'మేం మీడియా వాళ్లం.. మమ్మల్నే డబ్బులు అడుగుతావా' అంటూ బండ బూతులు తిట్టారు. శంషాబాద్ సీఐ నరేందర్ రెడ్డి వివరాల ప్రకారం.. శంషాబాద్‌పరిధిలోని తొండుపల్లి ఔటర్ ఎగ్జిట్ వద్ద సంజయ్ దత్ అనే యువకుడు టోల్ వసూల్‌సిబ్బందిగా పనిచేస్తున్నాడు.



మిగతా 2లో

# హరీశ్‌రావుది వన్‌సైడ్ లవ్..


## ఆయన కళ్లుండీ చూడలేకపోతున్నారు
## ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



**మహా:** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు హరీశ్ రావు మీద ప్రేమ లేదు గానీ, హరీశ్ రావుకు కేసీఆర్‌పై ప్రేమ ఉంది.. వన్‌సైడ్ లవ్ అది.. అని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ నేత హరీశ్‌రావుని కాంగ్రెస్ పార్టీలోకి అహ్వానించే స్థాయి తనకు లేదని, హరీశ్‌రావు ఆలోచించుకుంటే ఎక్కడికైన వెళ్లొచ్చని, ఆయన వాళ్ల మామను వదిలి రాలేడని చెప్పుకొచ్చారు. ఇక, తెలంగాణను కేసీఆర్ నిలబెడితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పడగొట్టారని హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలకు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఎవరు పడగొట్టారు? ఎవరు నిలబెట్టారు? అని ఫైర్ అయ్యారు. మిగులు రాష్ట్రాన్ని 7 లక్షల కోట్ల అప్పుకు తీసుకెళ్లిన వాళ్లు పడగొట్టినట్టా? అని ప్రశ్నించారు. పడిపోయిన రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, 200 యూనిట్ల కరెంట్, వడ్లకు రూ. 500 బోనస్, రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు, రూ.500 సిలిండర్ ఇచ్చినవాళ్లు నిలబెట్టినట్టా ? అని నిలదీశారు. హరీశ్ రావు కళ్లుండి కూడా చూడలేని, చెవులుండీ కూడా వినలేని కబోది అని చామల విమర్శించారు.

# రంగంలోకి సుప్రీం కమిటీ

## 400 ఎకరాల భూముల పరిశీలన
## కమిటీని కలిసిన బీఆర్ఎస్, బీజేపీ ప్రతినిధి బృందాలు



(మొదటి పేజీ తరువాయి)
అక్కడ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, జీఏడీ ముఖ్య కార్యదర్శి రఘునందన్, సీఎంవో కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, డీజీపీ జితేందర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, జలమండలి ఎండీ, టీజీఐఐసీ ఎండీతో సమావేశమైంది. కంచ గచ్చిబౌలి భూములపై ప్రభుత్వ అధికారులతో కమిటీ చర్చించింది. అనంతరం కంచ గచ్చిబౌలి భూములపై కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం నివేదిక సమర్పించింది. ఆ తర్వాత HCU పాలక వర్గంతో సాధికారక కమిటీ ప్రత్యేక భేటీ అయింది. వరుస భేటీల అనంతరం సుప్రీంకోర్టు సాధికార కమిటీ పర్యటన ముగించుకుని ఢిల్లీ పయనమైంది.

**సాధికారిక కమిటీతో హరీశ్‌రావు భేటీ**

కంచె గచ్చిబౌలిలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల నిబంధనలను ఉల్లంఘించి... కంచే చేను మేసినట్లు వేలాది చెట్లు కొట్టి వేసిందని, జంతువుల మరణానికి కారణమైందని బీఆర్ఎస్ నేత హరీశ్ రావు సాధికారక కమిటీకి వివరించారు. సర్కార్ ఉల్లంఘనల తీరు, వాస్తవ అంశాలు అన్నింటినీ పార్టీ తరపున డాక్యుమెంట్లు వారికి సమర్పించారు. రాష్ట్రంలో ఎక్కడ ఒక్క చెట్టు కొట్టి వేయాలన్నా వాల్టా చట్టం, అటవీశాఖ కింద అనుమతి తప్పనిసరి అని, ఎలాంటి అనుమతులు లేకుండా 50 బుల్‌డోజర్లు పెట్టి వేల చెట్ల కొట్టారని, జంతువుల ఆవాసాన్ని దెబ్బ తీశారని హరీశ్ రావు మీడియా ముందు ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేలాది చెట్లు కొట్టినా, జీవ విధ్వంసానికి పాల్పడినా కేసులు ఎందుకు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు.

# రామగుండం సమీపంలో పొంచి ఉన్న భూకంపం?

## ఈ వారంలో ఎప్పుడైనా రావొచ్చు
## రిక్టర్ స్కేలుపై 5.3 తీవ్రత?.. అలర్ట్ గా ఉండాలంటున్న ఎపిక్



(మొదటి పేజీ తరువాయి)
దాని ప్రకంపనలు సమీప ప్రాంతాలతోపాటు హైదరాబాద్‌కూ తాకాయి. ఇపుడు ఏప్రిల్ 10 నుంచి 17వ తేదీ మధ్యలో రామగుండంలో ఓ మోస్తరు భూకంపం వచ్చే అవకాశాలు ఉన్నాయని ఎపిక్ (ఎర్త్‌కేక్ రిసెర్చ్ అండ్ ఎనాలసిస్) హెచ్చరించింది. రిక్టర్ స్కేల్‌పై దాని తీవ్రత 5.3 గా ఉంటుందని తెలిపింది. ఆ భూకంపం వల్ల కలిగే ప్రకంపనలు వరంగల్, హైదరాబాద్‌తోపాటు.. ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లోనూ కనిపిస్తాయని తమ పరిశోధనలో తేలినట్టువెల్లడించింది.

ఇటీవల ములుగులో 5.3 తీవ్రతతో భూకంపం వస్తే హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో సైతం ప్రకంపనలు వచ్చాయి. అంతకు ముందు ఇదే ములుగు జిల్లాలో వందల హెక్టార్ల అటవీ భూమిలో రాత్రికి రాత్రే భారీ స్థాయిలో విధ్వంసంతో వేల చెట్లు కూకటివేళ్లతో సహా పెకలించుకుపోయాయి. హైదరాబాద్ మహానగరం భూకంప తీవ్రత తక్కువ కలిగిన ప్రాంతం (జోన్2) గా వర్గీకరించారు. హైదరాబాద్ నగరానికి ములుగు 200 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ములుగులో 2024 డిసెంబర్ నెలలో 5.3 తీవ్రతతో వచ్చిన భూకంపం.. తెలంగాణలో గత 50 ఏళ్లలో వచ్చిన అత్యంత శక్తిమంతమైన భూకంపం.


1982లో ఉస్మాన్ సాగర్ జలాశయం సమీపంలో సూక్ష్మ భూ కంపం వచ్చింది. 2020లో ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో వచ్చిన భూ ప్రకంపనలు భయాందోళనకు గురి చేశాయి. అక్టోబర్ 1994 నుంచి నవంబర్ 2017 మధ్య, ఒక్క జూబ్లీ హిల్స్‌లోనే 979 భూకంపాలు నమోదయ్యాయి, వాటిలో అత్యధికంగా 2.8 తీవ్రతతో భూకంపం సంభవించిందని రికార్డులు చెపుతున్నాయి. 1969 ఏప్రిల్ 13న భద్రాచలం సమీపంలో భూకంపం సంభవించింది. దీని తీవ్రత 5.7. 2024, డిసెంబర్ 4న ములుగు జిల్లాలో వచ్చిన భూకంపం తీవ్రత 5.3. ములుగు, భద్రాచలం, కొత్తగూడెం, హైదరాబాద్, విజయవాడ వంటి చోట్ల దీని ప్రభావం కనిపించింది. తాజా భూకంప హెచ్చరిక కలవరపాటుకు గురిచేస్తుండగా, తీవ్రత తక్కువగా ఉంటే ఇబ్బందేమీ ఉండదని చెబుతున్నారు.







# యంగ్ ఇండియా నా బ్రాండ్



## మహాత్మా గాంధీ నాకు స్ఫూర్తి

(మొదటి పేజీ తరువాయి)
ఆమె రోటి, మఖాన్ అనే విధానంతో ముందుకు సాగారని తెలిపారు.

**మీ బ్రాండ్ ఏంటని అడుగుతున్నారు..**

ముఖ్యమంత్రి అయ్యి 16 నెలలు అయిందని, విశ్లేషకులు, విలేకరులు మీ బ్రాండ్ ఏంటని అడుగుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తాను ఏ విజన్ కోసం పనిచేస్తున్నానో వారు అర్థం చేసుకునే స్థితిలో లేరని సీఎం చురకలు అంటించారు. ఎంతోమంది వస్తుంటారు, పోతుంటారు కొందరు మాత్రమే విజన్ క్రియేట్ చేస్తారని తెలియజేశారు. ఐటీ కంపెనీలను చూస్తే చంద్రబాబు గుర్తొస్తారని.. రైతులు, ఉచిత విద్యుత్ ను చూస్తే దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ గుర్తోస్తారని తెలిపారు. తాను విశ్లేషణకులందరికీ చెబుతున్నానని, నా బ్రాండ్ యంగ్ ఇండియా అని తెలిపారు. అత్యధిక జనాభా ఉన్న మన దేశం నుంచి ఎంతోమంది ఒలంపిక్స్ క్రీడల్లో పాల్గొన్నా కనీసం ఒక్క గోల్డ్ మెడల్ కూడా రాకపోవడం బాధాకరమన్నారు. ప్రతి ఏటా ఎంతోమంది ఇంజనీరింగ్ విద్యార్థులు పట్టాలు తీసుకుంటున్నావారిలో ఏమాత్రం నాణ్యత లేదని వాపోయారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్‌తో ప్రారంభించుకున్నామన్నారు. దానికి మహీంద్రా కంపెనీ చైర్మన్ ఆనంద్ మహేంద్రను చైర్మన్ గా నియమించుకున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి తో పాటు పలువురిని అందులో డైరెక్టర్లుగా నియమించినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ స్కూళ్లను ఎంతో అధునాతన వసతులతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఒక యంగ్ ఇండియా స్కూలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కో స్కూల్ కు 200 కోట్లు బడ్జెట్ లో కేటాయించినట్లు తెలిపారు. దేశ భవిష్యత్తు పాఠశాల తరగతి గదుల్లోనే ఉందన్నారు. అనంతరం సీఎం అతిథిలతో కలిసి స్పోర్ట్స్ డ్రెస్, వాటర్ బాటిల్స్ ఇతర వస్తువులు ఉన్న మ్యాజిక్ బాక్సులను విద్యార్థులకు అందజేశారు.

**అంతర్జాతీయ ప్రమాణాలతో..**

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ను అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రారంభించినట్లు మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. పోలీసులు శాంతిభద్రతల కోసం ఎంతో కష్టపడుతున్నారని తెలిపారు. మనం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి వచ్చే వరకు కూడా వారు మన కోసం ఎంతో కష్టపడుతున్నట్లు తెలిపారు. జాతీయ ప్రమాణాలతో ప్రైవేటు విదకు పోటీగా యంగ్ ఇండియా స్కూల్లో విద్యను అందిస్తామన్నారు. ఆర్మీ స్కూల్, హెచ్ పీఎస్ స్కూల్ మాదిరిగా దీనిని తీర్చిదిద్దుతామన్నారు. డీజీపీ జితేందర్ మాట్లాడుతూ.. అతి తక్కువ కాలంలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ను ప్రారంభించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేశారని కొనియాడారు. పోలీసుల సంక్షేమానికి ఆయన ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ సీపీ, యంగ్ ఇండియా స్కూలు చైర్మన్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ, పోలీసుల పిల్లలు స్కూలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండలి చీఫ్ విప్ డాక్టర్ మహేందర్ రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్ కాలే యాదయ్య, కుంభం అనిల్ కుమార్ పలువురు ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.




# ఉప ప్రధానిగా నితీష్ కుమార్?

## బిహార్ సీఎం పదవిపై బీజేపీ కన్ను

**మహా:** ఈ ఏడాది బిహార్ అసెంబ్లీకి ఎన్నికలు జరగబోతున్న వేళ ఆ రాష్ట్ర బీజేపీ నేత, కేంద్ర మాజీ మంత్రి అశ్వినీ కుమార్ చౌబే మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. బిహార్ సీఎం నితీశ్ కుమార్ ను ఉప ప్రధానిగా చేయాలని డిమాండ్ చేశారు. నితీశ్ కుమార్ ఉప ప్రధాని అయితే బిహార్ రాష్ట్రం నుంచి రెండో ఉప ప్రధానిగా చరిత్రలో నిలుస్తారన్నారు. గతంలో బిహార్ నుంచి జగ్జీవన్ రామ్ ఉప ప్రధానిగా పని చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు నితీశ్ కుమార్ ను ఉప ప్రధానిగా చేయాలని తాము కోరుకుంటున్నట్లు సంచలన కామెంట్స్ చేశారు. బిహార్ సిఎం పదవిపై కన్నేసిన బిజెపి నితీష్ ను తప్పించేందుకు ఇప్పటినుండే వ్యూహరచన ప్రారంభించినట్లు పరిశీలకులు భావిస్తున్నారు.

# భద్రాచలం ఠాణాపై ఏసీబీ దాడి

## లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సీఐ గన్ మెన్



(మొదటి పేజీ తరువాయి)
అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీని వదిలేందుకు డబ్బులు డిమాండ్ చేసిన రామారావు, ఆ లంచాన్ని సొంతంగా ఖాతాలో తీసుకోవడం, అందులో ఇతరుల ప్రమేయంపై ఏసీబీ విచారణ జరుపుతున్న తీరునే చూస్తే, లోపలి వ్యవస్థలో ఎన్నో అనుమానాస్పద సంబంధాలున్నాయని స్పష్టమవుతోంది. భద్రాచలం పట్టణంలో పోలీస్‌స్టేషన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ రామారావు, సీఐ రమేష్‌కు గన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. మార్చి 19న అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీని రోడ్డుపై అడ్డుకుని పట్టుకున్న రామారావు, ఆ లారీని వదిలేందుకు ముట్టజెప్పిన మాటలు ఇప్పుడు అతనిని గండిలో పడేశాయి. బాధితుడి నుంచి రూ.30 వేలు లంచం డిమాండ్ చేసిన రామారావు, మాట్లాడుకున్న అనంతరం రూ.20 వేలు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నాడు. చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసులు లంచం కోసం ఈ స్థాయిలో దిగజారడం కలవరపెడుతోంది. పైగా ఆ డబ్బును ఏ వ్యక్తిగత ఖాతాలోనూ కాదు, ఓ ప్రైవేట్ వ్యక్తి ఖాతాలో జమ చేయించుకోవడం, ఈ వ్యవహారం పక్కా ప్రణాళికతో సాగిందన్న అనుమానాలకు తావిస్తోంది. రామారావుతో పాటు, ఈ కేసులో సీఐ రమేష్, లావాదేవీలో ఉపయోగించిన ప్రైవేట్ వ్యక్తిని కూడా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. విచారణలో కీలకమైన ప్రశ్నలు మెదులుతున్నాయి. ఆ డబ్బును రామారావు తన కోసం తీసుకున్నాడా..? లేక సీఐకి ఇవ్వాల్సిన ఉద్దేశంతో ఇంటర్మీడియట్‌గా వ్యవహరించాడా..? మరేదైనా పెద్ద సంబంధం ఉందా..? అనే కోణాల్లో ఏసీబీ అధికారులు లోతుగా తవ్వకాలు జరుపుతున్నారు. సీఐ పాత్రపై స్పష్టత వచ్చేవరకు ఈ దర్యాప్తు కీలక దశలో కొనసాగనుంది.

**ఏసీబీ దర్యాప్తుతో షాక్‌లో అధికారులు.**

ఈ కేసు వెలుగులోకి రావడంతో భద్రాచలం సబ్ డివిజన్‌లోని పోలీసు వర్గాల్లో ఒక రకమైన ఉలికిపాటు నెలకొంది. రామారావు వంటి సాధారణ కానిస్టేబుల్ నుంచే ఈ స్థాయిలో లావాదేవీలు జరగడం, అందులో ప్రైవేటు వ్యక్తులు కూడా కలవడం, పై స్థాయి అధికారుల ప్రమేయాన్ని దర్యాప్తు చేయాల్సిన పరిస్థితి ఏర్పడటంతో, వ్యవస్థలో ఎక్కడెక్కడ లోపాలున్నాయో అన్వేషణ మొదలైంది. ఈ ఘటన వల్ల మరోసారి అవినీతి వ్యతిరేక పోరాటం ఎంత ప్రాముఖ్యత కలిగిందో స్పష్టమవుతోంది. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుని, పోలీసు వ్యవస్థ పట్ల ప్రజల్లో నమ్మకం పెంపొందించేలా ఏసీబీ నిష్పక్షపాతంగా ముందుకు సాగాలని ప్రజలు ఆశిస్తున్నారు. భద్రాచలం పోలీస్‌స్టేషన్ నుంచి వెలువడిన ఈ అవినీతి కథనానికి చివర ఏమవుతుందో చూస్తుండగానే, రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి దాగి ఉన్న వ్యవహారాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం కనిపిస్తోంది.

# మేం రిపోర్టర్లం మమ్మల్నే టోల్ అడుగుతావా

(మొదటి పేజీ తరువాయి)
మంగళవారం సాయంత్రం కారు (టీఎస్ 08 ఈఎన్ 0027)లో దర్జాగా ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రయాణిస్తూ వచ్చిన ఇద్దరు వ్యక్తులు టోల్‌చెల్లించకపోవడంతో వారిని ఫీజు చెల్లించాలని సంజయ్ దత్ కోరాడు. దీంతో 'మేం మీడియా వాళ్లం.. మమ్మల్నే డబ్బులు అడుగుతావా' అంటూ కారులో నుంచి కిందకు దిగిన ఓ వ్యక్తి టోల్ బూతులోకి చొరబడి హంగామా సృష్టించాడు. బండ బూతులు తిడుతూ దాడికి తెగబడ్డాడు. అంతటితో ఆగకుండా టోల్ ఫీజు అడిగిన సంజయ్ దత్ కాలర్ పట్టుకుని బయటకు ఈడ్చాడు. ఇంతలోనే మరో ఇద్దరు వ్యక్తులు దాడికి తెగబడ్డ యువకుడికి మద్దతుగా టోల్ గేట్ సిబ్బందిపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. అడ్డుకోబోయిన వారిపై సైతం దాడికి యత్నించి పరారయ్యాడు. దాడికి సంబంధించిన దృశ్యాలు సీసీ పుటేజీలో రికార్డు కాగా, బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను రాజేంద్రనగర్ పరిధిలోని కిస్మత్‌పూర్ ప్రాంతానికి చెందిన వ్యక్తులుగా గుర్తించినట్లు సమాచారం.



# కేంద్రం ఇచ్చేది దొడ్డు బియ్యమే..సన్న బియ్యం ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే

## 20 శాతం అదనపు వ్యయంతో అందరికీ సన్న బియ్యం

- దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పి కొట్టాలి
- అర్హులైన వారందరికీ తెల్ల రేషన్ కార్డులు
- ధాన్యం దిగుబడిలో తెలంగాణా రికార్డ్
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**మహా :** దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేదలందరికీ ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఘనత ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికే దక్కుతుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తేల్చిచెప్పారు. స్వతంత్ర భారతదేశంలో మొట్టమొదటి సారిగా పేదలకు సన్నబియ్యం అందిస్తున్న రాష్ట్రంగా తెలంగాణాకు దక్కిందని ఆయన పేర్కొన్నారు. కేంద్రం సన్నబియ్యం పంపిణీ చేస్తుందన్న ప్రచారంలో ఎంతమాత్రం వాస్తవం లేదని ఆయన కొట్టిపారేశారు. కేంద్రం సరఫరా చేసేది ఇప్పటికీ దొడ్డు బియ్యమేనని, అది కుడా కొందరికే పరిమితమని ఆయన స్పష్టం చేశారు. సన్న బియ్యం పంపిణీ చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వం చారిత్రత్మక నిర్ణయం తీసుకోని అమలులోకి తెచ్చాక కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న దొడ్డు బియ్యం స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని 20 శాతం అదనంగా వెచ్చించి అందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. గురువారం మధ్యాహ్నం జలసౌధ నుండి ఆయన లోకసభ ,శాసనసభ,శాసన మండలి, కార్పొరేషన్ చైర్మన్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, దేశ చరిత్రలోనే ఇంతకు మించిన సంక్షేమ కార్యక్రమం మరోటి ఉండబోదన్నారు. సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులందరూ భాగస్వామ్యం కావడమే కాకుండా సన్న బియ్యం లబ్ధిదారులతో కలసి భోజనం చేయాలని, తద్వారా పేదల పట్ల కాంగ్రెస్ పార్టీ పెట్టిన ప్రత్యేక దృష్టిని ప్రజలు గుర్తిస్తారని ఆయన ప్రజాప్రతినిధులకు ఉద్బోధించారు. ప్రతి లబ్దిదారుడికి నెలకు 6 కిలోల చొప్పున అందిస్తున్న సన్నబియ్యంపై రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి 13 వేల కోట్లు ఖర్చు చేస్తున్న విషయాన్ని ప్రజల్లోకి విరివిగా తీసుకు పోవాలని సూచించారు. ఏటా మూడు కోట్ల 10 లక్షల మందికి ఉచితంగా 30 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం సరఫరా చేయలని నిర్ణయించామన్నారు. సన్నబియ్యం సరఫరాకు ముందు కేంద్రం, రాష్ట్రం కలిపి 10,665 కోట్లు ఖర్చు చేసి పంపిణీ చేస్తున్న దొడ్డు బియ్యం పక్కదోవ పట్టి అనేక అక్రమాలకు తెర లేవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమానికి అంకురార్పణ చుట్టిందన్నారు. ఈ నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వం మీద అదనంగా 2,858 కోట్లు భారం పడినా సంవత్సరానికి మొత్తంగా 8,033 కోట్లు ఖర్చు పెట్టి ఈ సాహసోపేత నిర్ణయం తీసుకున్నామన్నారు. అదే సమయంలో సన్న బియ్యం పంపిణీలో కేంద్రం పాత్ర ఉందంటూ విపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజాప్రతినిధులు ముక్తకంఠంతో తిప్పి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలందరికీ తెల్ల రేషన్ కార్డుల మంజూరు చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. లబ్ధిదారుల దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని త్వరితగతిన పరిశీలన జరిపి తెల్ల రేషన్ కార్డులు అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టబోతున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రత్యేక తెలంగాణా ఆవిర్భావ సమయంలో 89.73 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉండగా పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆ ప్రభుత్వం మంజూరు చేసింది కేవలం 49,479 తెల్ల కార్డులేనని ఆయన ఎద్దేవా చేశారు. అంతే కాదు కనీసం ఉన్న రేషన్ కార్డులలో కొత్త సభ్యులని చేర్పించడంలోను బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపిందని ఆయన దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు లబ్ధిదారుల నుండి 30 లక్షల దరఖాస్తులు స్వీకరించామన్నారు. లబ్దిదారుల సంఖ్య 2 కోట్ల 81 లక్షల నుండి 3 కోట్ల 10 లక్షలకు పెరగవచ్చని ఆయన తెలిపారు. పెరుగుతున్న లబ్దిదారులకు సరిపడా సన్న బియ్యం పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధంగా ఉందన్నారు. బీఆర్ఎస్ పాలనలో కట్టిన కాళేశ్వరం కూలి పోయినా మెడిగడ్డ పని చేయక పోయిన రాష్ట్రంలో ఖరీఫ్, రబీ సీజన్ లో కలిపి 123.27 లక్షల ఎకరాలలో 281 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అయిందంటే అది కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగం పట్ల అనుసరించిన విధానాలే కారణమన్నారు. ఖరీఫ్ లో 66.78 లక్షల ఎకరాలలో 153.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అయితే రబీలో సాగు చేసిన 56.49 లక్షల ఎకరాలలో 127.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడిని అంచనా వేస్తున్నామని ఆయన వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 4.41 లక్షల మంది రైతుల నుండి 24 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 1,199 కోట్లు బోనస్ రూపంలో చెల్లించామన్నారు. రబీ సీజన్ లో ధాన్యం కొనుగోలుకు గాను 8,209 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. ధాన్యం కొనుగోలులో ఆయా జిల్లాల కలెక్టర్ లకు పూర్తి స్థాయిలో అధికారం ఇచ్చామని అదనంగా ధాన్యపు కొనుగోలు కేంద్రాలు ఆవశ్యకత ఉన్న చోట ప్రజాప్రతినిధులు ఆయా కలెక్టర్ లతో సంప్రదించి ఏర్పాటు చేసుకోవచ్చాన్నారు. అయితే ధాన్యం కొనుగోలు విషయంలో 17 శాతానికి మించి ఉంటే అంగీకరించే ప్రసక్తి లేదని ఇది జాతీయ విధానమన్నారు. అదే సమయంలో 25 శాతానికి మించి నూకలు ఉన్న బియ్యం సరఫరా చేస్తే రైస్ మిల్లర్లపై చర్యలు కఠినంగా ఉంటాయని మంత్రి హెచ్చరించారు.

# మాజీ ఎమ్మెల్యే షకీల్ అరెస్ట్

## శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో అదుపులోకి

## కొంతకాలంగా దుబాయ్ లోనే ఉంటున్న షకీల్

## రోడ్డు ప్రమాదం కేసు నుంచి కొడుకును తప్పించేందుకు ప్లాన్



**మహా :** బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్ ను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. దుబాయ్ నుంచి వచ్చిన ఆయనను విమానాశ్రయంలోనే అదుపులోకి తీసుకున్నారు. ఓ రోడ్డు ప్రమాదం కేసు నుంచి తన కుమారుడిని తప్పించే ప్రయత్నం చేసినందుకు షకీల్ పై పోలీసులు గతంలోనే వారెంట్ జారీ చేశారు. ఈ విషయం తెలుసుకున్న షకీల్ దుబాయ్ వెళ్లిపోయి కొంతకాలంగా అక్కడే ఉంటున్నారు. తల్లి మరణించడంతో ఆమె అంత్యక్రియల్లో పాల్గొనేందుకు గురువారం ఉదయం హైదరాబాద్ విమానాశ్రయంలో దిగారు. షకీల్ భారత్ కు వస్తున్నారనే సమాచారంతో అప్పటికే విమానాశ్రయానికి చేరుకున్న పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. 2023లో షకీల్ కుమారుడు రహేల్ వేగంగా కారు నడుపుతూ ప్రజా భవన్ ముందు ప్రమాదానికి కారణమయ్యాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేయగా తన కుమారుడిని తప్పించేందుకు షకీల్ పోలీసులను తప్పుదోవ పట్టించారు. వెంటనే కొడుకును దుబాయ్ పంపించేశారు. కొడుకును తప్పించేందుకు, దుబాయ్ పారిపోయేందుకు షకీల్ సహకరించారని పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో షకీల్ పైనా పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. ఈ విషయం తెలిసి షకీల్ కూడా దుబాయ్ పారిపోయారు. గత కొంతకాలంగా అక్కడే ఉంటున్నారు. తల్లి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు షకీల్ దుబాయ్ నుంచి హైదరాబాద్ వచ్చారు. అయితే తన తల్లి మరణించడంతో అంత్యక్రి.లకు వచ్చానని అనుమతించాలని షకీల్ కోరడంతో పోలీసులు అనుమతిచ్చారు. పోలీసుల సమక్షంలో ఆయన అంత్యక్రియలకు హాజరయ్యారు. అంత్యక్రియలు పూర్తయ్యాక షకీల్ ను పోలీస్ స్టేషన్ కు తరలించారు.

## ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు

# స్కూళ్లకు వేసవి సెలవులు

**మహా :** తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు ఉపశమనాన్ని కలిగించే కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరిగి, ఎండలు తీవ్రంగా మండుతున్న నేపథ్యంలో, స్కూళ్లకు వేసవి సెలవులు ప్రకటించింది. ఏప్రిల్ 24వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ మరియు ఎయిడెడ్ పాఠశాలలకు సెలవులు ఉండనున్నాయని విద్యాశాఖ అధికారికంగా ప్రకటించింది. పాఠశాలలు తిరిగి జూన్ 12న ప్రారంభం కానున్నాయి. ఇటీవల వేసవి సెలవులపై సోషల్ మీడియాలో, ఇతర వేదికల్లో రకరకాల ఊహాగానాలు, తప్పుడు సమాచారం చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో విద్యాశాఖ ఈ ప్రకటనతో స్పష్టతనిచ్చింది. ఈ షెడ్యూల్‌ను తెలంగాణ అకడమిక్ క్యాలెండర్ 202425 ప్రకారమే నిర్ణయించినట్టు స్పష్టం చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఒక్కపూట బడుల విధానం అమలులో ఉంది. ఉదయం మాత్రమే పాఠశాలలు కొనసాగుతున్నాయి. అయితే, వేసవి సెలవులు రాగానే మొత్తం 45 రోజులకుపైగా పాఠశాలలు మూతపడనున్నాయి. దీనివల్ల విద్యార్థులకు వేసవిలో విశ్రాంతి లభించనుంది.

## ఫామ్ హౌజ్ నుంచి ఆస్పత్రికి

# కేసీఆర్ కు ఏమైంది?

**మహా :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి చేరుకున్నారు. జనరల్ హెల్త్ చెకప్ కోసం ఆస్పత్రికి వచ్చినట్లు ఆయన వ్యక్తిగత సిబ్బంది చెబుతున్నారు. వైద్యులు పలు హెల్త్ టెస్టులు చేశారు. రిపోర్టులు వచ్చాక కేసీఆర్ కండీషన్‌పై వైద్యులు క్లారిటీ ఇవ్వనున్నారు. గతంలో సోమాజీగూడలోని యశోద ఆస్పత్రికి వెళ్లిన కేసీఆర్ ఇపుడు ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రికి వెళ్తున్నారు. ఏడాది క్రితం కాలు జారి పడినప్పుడూ సోమాజిగూడ యశోదలోనే ఆయన తుంటికి ఆపరేషన్ చేశారు. కేసీఆర్ రెగ్యులర్ చెకప్ కూడా ఎప్పుడూ అక్కడే చేస్తుంటారు. కానీ ఈ మధ్య గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి వస్తున్నారు. మరోవైపు 27న బీఆర్ఎస్ ఆవిర్భావ సభ వరంగల్ లో నిర్వహించనున్నారు. బీఆర్ఎస్ చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ శ్రేణులు కంకణం కట్టుకున్నారు. సభను పూర్తిస్థాయిలో విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులతో ఫాంహౌజ్ లోనే కేసీఆర్ వరుస సమీక్షలను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కేసీఆర్ ఆస్పత్రిలో ఉండటం ఆందోళన కలిగించే విషయం.

# ఇంటింటికీ డిజిటల్ సేవల లక్ష్యం

## టీ ఫైబర్ ను టీ ఎన్ఎక్స్ టీగా అభివృద్ధి చేస్తున్నాం

### 43 వేల కిలోమీటర్ల ఫైబర్ నెట్‌వర్క్ – దేశంలోనే అతిపెద్ద ప్రాజెక్ట్

### స్మార్ట్ టీవీ ద్వారా ఇంట్లోనే టెలిఫోన్, కంప్యూటర్ సౌకర్యాలు

### ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు




**మహా :** రాష్ట్రంలో డిజిటల్ సేవల విస్తరణపై ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కీలక ప్రకటన చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ ఇంటర్నెట్, టెలిఫోన్, కంప్యూటర్ సేవలను తక్కువ ధరలో అందించేందుకు ప్రభుత్వం నూతన ప్రణాళికతో ముందుకు వెళ్తుందన్నారు. ఇప్పటి వరకు ఉన్న టీ ఫైబర్ సేవలను మరింత విస్తరించి, నూతన సర్వీసులు జత చేస్తూ టీ ఎన్ఎక్స్ టీగా ఆవిష్కరిస్తున్నామని చెప్పారు. ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సౌకర్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, చివరి గ్రామం, చివరి ఇంటి వరకు ఫైబర్ కనెక్టివిటీ చేర్చే పనిలో ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమం వచ్చే ఆరు నెలల్లో పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుందని చెప్పారు. ఇప్పటికే నాలుగు గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతంగా నడుస్తోందని, అక్కడ ప్రజలు ఎంతో హర్షిస్తున్నారని చెప్పారు. ప్రతి ఇంటిలో స్మార్ట్ టీవీ ద్వారా టెలిఫోన్, కంప్యూటర్ సదుపాయాలు లభించేలా తయారు చేస్తున్నారని, ఇది విద్య, సమాచారం పరంగా ప్రజలకు చాలా ఉపయోగకరంగా మారనుందని వివరించారు. ఇప్పటివరకు దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా 43,000 కిలోమీటర్ల ఫైబర్ నెట్‌వర్క్ ఏర్పాటు చేస్తున్నామని, ఇది దేశంలోనే అతిపెద్ద ప్రాజెక్ట్‌గా నిలవనుందని మంత్రి పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి, పెద్ద తరగతి ప్రజలందరికీ సమానంగా సేవలు అందించాలన్నదే మా ధ్యేయమని, ఫింగర్‌టిప్‌లో సమాచారం ఉండేలా సాంకేతిక వనరులు అందిస్తున్నామన్నారు. ఇవన్నీ అతి తక్కువ ధరకు అందించేందుకు ప్రయత్నిస్తున్నామని అని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా 2013లో యూపీఏ ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్ ద్వారా గ్రామాల్లో ఫైబర్ నెట్‌వర్క్ ఇవ్వాలని ప్రారంభించిందని, రాష్ట్ర విభజన తరువాత గత ప్రభుత్వం దీన్ని కొనసాగించిందన్నారు. ఇప్పుడు మేము దీనిని పూర్తి చేయబోతున్నామన్నారు. మా ప్రభుత్వానికి సంవత్సరం నాలుగు నెలలు పూర్తవుతున్న ఈ సమయంలో, మిగిలిన 40 శాతం పనులు పూర్తి చేశామని, మిగిలినవన్నీ సమయానుకూలంగా పూర్తి చేస్తామన్నారు.

## మోదీ గురించి మాట్లాడితే

# ఖబర్దార్ రేవంత్ రెడ్డి

## బీజేఎల్ పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**మహా :** ఏఐసీసీ ప్లినరీ సమావేశంలో సీఎం రేవంత్ మాట్లాడిన తీరు మతి స్థిమితం లేని వ్యక్తి మాట్లాడినట్లుందని బీజేఎల్ పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. పదవి కాపాడుకోవడానికి, రాహుల్ గాంధీ మెప్పు కొసం మాట్లాడుతున్నారన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రేవంత్ వ్యాఖ్యలు బుడ్డర్ కాన్ మాటల్లాగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. మీనాక్షి నటరాజన్ ఎప్పుడు సెక్రటేరియట్ లో అడుగు పెట్టారో అప్పుడే రేవంత్ అసమర్థుడని తేలిందన్నారు. సీఎం లేని సమయంలో రాజ్యంగేతర శక్తి సెక్రటరియేట్ లో రివ్యూ చేసిందని, గతంలో ఎన్నడూ లేదన్నారు. రేవంత్ రెడ్డి తన స్థాయికి మించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మీరు ఏ గడ్డ మీద మాట్లాడారో... అదే గడ్డపై మోదీ మూడు సార్లు ముఖ్యమంత్రి, ప్రధాని అయ్యాడని గుర్తుంచుకోవాలన్నారు. మతాన్ని ముక్కలు చేసింది కాంగ్రెస్ పార్టీ అని, నెహ్రూ ప్రధాని కావాలని దేశాన్ని ముక్కలు చేశారని మండిపడ్డారు. మతం పేరు మీద దేశాన్ని విభజన చేసింది కాంగ్రెస్ పార్టీ అన్న విషయాన్ని ప్రజలు మరువరన్నారు. దేశ ప్రజలు గతాన్ని మర్చిపోయారని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారని, అందుకే గతంలో కాంగ్రెస్ ఏం చేసిందో మరిచిపోయి.. మాట్లాడుతున్నారని విరుచుకుపడ్డారు. మాట్లాడే ముందు రేవంత్ రెడ్డి గతాన్ని తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. దేశ భక్తి ఉన్న పార్టీ బీజేపీ అని, దమ్ము, ధైర్యం ఉంటే బహిరంగ చర్చకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. 420 హామీలు, ఆరు గ్యారెంటీలు ఎగొట్టిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఆరోపించారు. తెలంగాణా ప్రజలను మోసం చేసిన రాహుల్ గాంధీని, ఇక్కడి ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి దేశ భక్తి ఉందా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలకు శరైన పాలన అందించానని రేవంత్ రెడ్డి బావిస్తే రాజీనామా చేసి ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. కొడంగల్ నుంచి తిరిగి పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ సిద్ధాంతం ఔరంగజెబ్ సిద్ధాంతమని, ఆ పార్టీ తీసుకున్న ప్రతి నిర్ణయం హిందూ వ్యతిరేక నిర్ణయం అని అన్నారు. రాహుల్ గాంధీకీ భారతదేశం మీద ప్రేమ కంటే విదేశీ ప్రేమ ఎక్కువగా ఉందని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ మోకాళ్లపై నడిచినా ఈ దేశానికి ప్రధాన మంత్రి కాలేదన్నారు.



## తెలంగాణ పర్యాటక రంగంలో

# పెట్టుబడులు పెట్టండి

### దక్షిణాసియా 20వ హోటల్స్ ఇన్వెస్ట్మెంట్ కాన్ఫరెన్స్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు

**మహా:** తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పర్యాటక విధానంతో దేశంలో ఎక్కడ లేని విధంగా ఆతిధ్య రంగంలో అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం ముంబయి పోవై లేక్ లో జరిగిన దక్షిణాసియా 20వ హోటల్స్ ఇన్వెస్ట్మెంట్ కాన్ఫరెన్స్ లో మంత్రి జూపల్లి పాల్గొన్నారు. ప్రఖ్యాత హోటల్స్, ట్రావెల్స్ సంస్థల ప్రతినిధులతో మంత్రి జూపల్లి ప్రత్యకంగా సమావేశమై తెలంగాణ ఆతిధ్య రంగంలో పెట్టుబడులు పెట్టి పర్యాటక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్ షిప్ (పీపీపీ) విధానం ద్వారా పర్యాటకాభివృద్ధి చేయాలని భావిస్తున్నామని, పర్యాటక రంగానికి ఊతమిచ్చేలా రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు వచ్చే పెట్టుబడిదారులకు పెద్ద ఎత్తున మెరుగైన రాయితీలు, ప్రోత్సాహకాలను కల్పించి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని భరోసానిచ్చారు జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులకు తొలి గమ్యస్థానంగా తెలంగాణను నిలబెట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

## ఫామ్ హౌజ్ నుంచి ఆస్పత్రికి

# కేసీఆర్ కు ఏమైంది?

### జనరల్ హెల్త్ చెకప్ కోసమంటున్న వ్యక్తిగత సిబ్బంది

**మహా :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి చేరుకున్నారు. జనరల్ హెల్త్ చెకప్ కోసం ఆస్పత్రికి వచ్చినట్లు ఆయన వ్యక్తిగత సిబ్బంది చెబుతున్నారు. వైద్యులు పలు హెల్త్ టెస్టులు చేశారు. రిపోర్టులు వచ్చాక కేసీఆర్ కండీషన్‌పై వైద్యులు క్లారిటీ ఇవ్వనున్నారు. గతంలో సోమాజీగూడలోని యశోద ఆస్పత్రికి వెళ్లిన కేసీఆర్ ఇపుడు ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రికి వెళ్తున్నారు. ఏడాది క్రితం కాలు జారి పడినప్పుడూ సోమాజిగూడ యశోదలోనే ఆయన తుంటికి ఆపరేషన్ చేశారు. కేసీఆర్ రెగ్యులర్ చెకప్ కూడా ఎప్పుడూ అక్కడే చేస్తుంటారు. కానీ ఈ మధ్య గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి వస్తున్నారు. మరోవైపు 27న బీఆర్ఎస్ ఆవిర్భావ సభ వరంగల్ లో నిర్వహించనున్నారు. బీఆర్ఎస్ చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ శ్రేణులు కంకణం కట్టుకున్నారు. సభను పూర్తి స్థాయిలో విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులతో ఫాంహౌజ్ లోనే కేసీఆర్ వరుస సమీక్షలను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కేసీఆర్ ఆస్పత్రిలో ఉండటం ఆందోళన కలిగించే విషయం.

# ఎన్నారై అడ్వయిజరీ కమిటీ నియామకం

## ఏడాదిలోగా ఇచ్చిన హామీని నెరవేర్చిన సీఎం రేవంత్ రెడ్డి

### గల్ఫ్ కార్మికుల సంక్షేమం, సమగ్ర ఎన్నారై పాలసీపై అధ్యయనం

### కమిటీలో ముగ్గురు ఎమ్మెల్యేలు, ఒక మాజీ మంత్రి, ఒక మాజీ ఎమ్మెల్యే




**మహ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు గల్ఫ్ కార్మికుల సంక్షేమం, సమగ్ర ఎన్నారై పాలసీ పై అధ్యయనం చేయడానికి అడ్వయిజరీ కమిటీని నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గురువారం జి.ఓ. విడుదల చేశారు. రెండేళ్ల కాలపరిమితి గల ఈ కమిటీ చైర్మన్ గా ఇండియన్ ఫారిన్ సర్వీస్ రిటైర్డ్ అధికారి, అంబాసిడర్ డా. బి.ఎం. వినోద్ కుమార్, వైస్ చైర్మన్ గా గల్ఫ్ వలసల నిపుణులు మంద భీంరెడ్డి లను నియమించారు. జీఏడీ ప్రోటోకాల్, ఎన్నారై విభాగానికి చెందిన జాయింట్ సెక్రెటరీ స్థాయి ఐఏఎస్ అధికారి కమిటీకి మెంబర్ సెక్రెటరీగా వ్యవహరిస్తారు. కమిటీలో గౌరవ సభ్యులుగా మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్, బాల్కొండ మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ లను నియమించారు. గల్ఫ్ వలసలపై క్షేత్ర స్థాయిలో అవగాహన కలిగిన ప్రవాసీ కార్మిక నాయకులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, డా. లిజీ జోసెఫ్, చెన్నమనేని శ్రీనివాస రావు, కొట్టాల సత్యంనారా గౌడ్, గుగ్గిల్ల రవిగౌడ్, నంగి దేవేందర్ రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల లను కమిటీ సభ్యులుగా నియమించారు.

**సీఎం హామీ నేపథ్యంలో...**

గత సంవత్సరం ఏప్రిల్ 16న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ తాజ్ దక్కన్ లో గల్ఫ్ సంఘాల ప్రతినిధులతో సమావేశమైన సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గల్ఫ్ తదితర గమ్యస్థాన దేశాలలోని అల్పాదాయ తెలంగాణ వలస కార్మికులకు ఆయా దేశాలలో లభిస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను ఈ కమిటీ పరిశీలిస్తుంది. దేశంలోని కేరళ, పంజాబ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో గల్ఫ్ కార్మికులకు అందుబాటులో ఉన్న సంక్షేమ పథకాలను ఈ కమిటీ అధ్యయనం చేస్తుంది. ప్రవాసీ కార్మికుల సమస్యలను అర్థం చేసుకోవడానికి, పరిష్కారాలను కనుగొనడానికి ఈ కమిటీ గల్ఫ్ దేశాలను కూడా సందర్శిస్తుంది. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా సమగ్ర ప్రవాస భారతీయుల విధానం (ఎన్నారై పాలసీ) రూపకల్పన తో పాటు, తెలంగాణ గల్ఫ్ అండ్ అదర్ ఓవర్సీస్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు (గల్ఫ్ తదితర దేశాల్లోని తెలంగాణ ప్రవాసీ కార్మికుల సంక్షేమ బోర్డు) ఏర్పాటు చేయడానికి రాష్ట్రప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుంది.



# రైతులకు గుడ్ న్యూస్

**హైదరాబాద్, మహా:** రైతులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఓ గుడ్ న్యూస్ తెలిపారు. గత నెలలో కురిసిన వడగళ్ల వానకు నష్టపోయిన రైతులకు పంట నష్టం అందించనున్నట్టు ప్రకటించారు. మార్చ్ లో కురిసిన వడగళ్ళ వానకు 8,408 ఎకరాల్లో జరిగిన పంట నష్టం జరిగినట్టు గుర్తించామని పేర్కొన్న మంత్రి, రైతులకు పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వ్యవసాయశాఖ అందించిన వివరాల ప్రకారం నష్టపరిహారం వివరాలు త్వరలోనే ప్రకటిస్తామని అన్నారు. అలాగే ఈనెల 3 నుంచి 9 వరకు కురిసిన వడగళ్ళ వానకు, ఈదురు గాలులకు జరిగిన నష్టంపై ప్రాథమిక నివేదిక ప్రభుత్వానికి అందింది అని, దానిని పరిశీలించి వారికి కూడా పరిహారం అందిస్తామని మంత్రి తుమ్మల వెల్లడించారు.

EDITORIAL సంపాదకీయం

# బీజేపీ అన్యాయాలపై న్యాయ్ పథ్ పోరాటం

**కాంగ్రెస్ పార్టీ దేశం కోసం బలిదానాలు చేస్తే దేశ స్వాతంత్ర పోరాటంలో ఎక్కడా లేని బీజేపీ ఇప్పుడు స్వాతంత్ర సమరయోధులను కించపరుస్తుంది. గాంధీ, నెహ్రూ, సర్దార్ వల్లభ్భాయ్ పటేల్ దేశం కోసం, ప్రజాస్వామ్యం కోసం తమ జీవితాలనే ధారపోస్తే బీజేపీ అభూత కల్పనలతో చరిత్రను వక్రీకరిస్తోంది.**





-బి.మహేశ్ కుమార్ గౌడ్,
ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షులు

దేశానికి స్వాతంత్ర ఫలాలు అందించిన కాంగ్రెస్ ఇప్పుడు ప్రజాస్వామ్యం రక్షణకు అహ్మదాబాద్ వేదికగా శంఖం పూరించింది. బీజేపీ నియంతృత్వ పోకడలతో రాజ్యాంగానికి, లౌకికవాదానికి ప్రమాదం ఏర్పడడంతో పాటు దేశం అన్ని రంగాల్లో వెనుకబడుతున్న తరుణంలో అహ్మదాబాద్లో జరిగిన 86వ ఏఐసీసీ సమావేశం దేశ ప్రజల్లో భరోసా కల్పించేలా పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పవిత్రమైన రాజ్యాంగాన్ని మార్చాలని కుట్రలు పన్నుతూ, లౌకికవాదానికి తూట్లు పొడుస్తూ, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తూ, దేశంలోని అన్ని వ్యవస్థలను నీరుగారుస్తూ, ఆర్థిక రంగాన్ని భ్రష్టు పట్టిస్తూ దేశాన్ని అంధకారంలోకి నెడుతున్న బీజేపీ ఒంటెత్తు పోకడల పాలనకు అడ్డుకట్ట వేసేలా కాంగ్రెస్ కదన రంగంలోకి దిగుతోంది.

కాంగ్రెస్ పార్టీ దేశం కోసం బలిదానాలు చేస్తే దేశ స్వాతంత్ర పోరాటంలో ఎక్కడా లేని బీజేపీ ఇప్పుడు స్వాతంత్ర సమరయోధులను కించపరుస్తుంది. గాంధీ, నెహ్రూ, సర్దార్ వల్లభ్భాయ్ పటేల్ దేశం కోసం, ప్రజాస్వామ్యం కోసం తమ జీవితాలనే ధారపోస్తే బీజేపీ అభూత కల్పనలతో చరిత్రను వక్రీకరిస్తోంది. ఈ నేపథ్యంలో వల్లభ్భాయ్ పటేల్ 150వ జన్మదినోత్సవం సందర్భంగా ఆయన స్వస్థలం గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ లో సర్దార్ పటేల్ స్మారకం వద్ద ఏఐసీసీ సమావేశాలను నిర్వహించి గాంధీ, నెహ్రూ, పటేల్ స్ఫూర్తితో దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ నేతలకు, కార్యకర్తలకు ఏఐసీసీ మార్గదర్శకం చేసింది. గాంధీ, నెహ్రూ, పటేల్ మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు లేకపోయినా బీజేపీ, దాని మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తుందని దీన్ని అడ్డుకోవాల్సిన ఆవశ్యకతపై సమావేశంలో చర్చించారు. గాంధీ సిద్ధాంతాలను అనుసరించే కాంగ్రెస్ లో తొలినాటి నుండి నెహ్రూ అయినా, పటేల్ అయినా ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చించి సమిష్టి నిర్ణయాలు తీసుకునేవారు. అంతేకాని బీజేపీ, ఆర్ఎస్ఎస్ వలే కాంగ్రెస్ లో ఒంటెత్తుపోకడలు మొదటి నుండి లేవు. దేశంలో ప్రస్తుతం బీజేపీ పాలన గత బ్రిటిష్ పాలనల ఉందని, దీనికి అడ్డుకట్ట వేసేందుకు కాంగ్రెస్ తీర్మానాలు చేసింది.

అహ్మదాబాద్ ఏఐసీసీ సమావేశంలో అన్ని రంగాలకు భరోసా కల్పించేలా తీర్మానాలు చేశారు. రైతులకు అండగా నిలుస్తూ స్వాతంత్ర పోరాటానికి నాంది పలికిన గాంధీ, వల్లభాయ్ పటేల్ ను స్ఫూర్తిగా తీసుకుంటూ బీజేపీ వ్యవసాయ నల్ల చట్టాలను వ్యతిరేకిస్తూ, చట్టబద్ధంగా పంటలకు మద్దతు ధర కల్పించేందుకు అన్నదాతలకు అండగా నిలవాలని నిర్ణయించింది. జవహర్ లాల్ నెహ్రూ మార్గదర్శకంలో సర్దార్ వల్లభాయ్ నేతృత్వంలో దేశంలో 560 పైగా పలు సంస్థానాలను దేశంలో విలీనం చేసి భారత్ ను బలోపేతం చేయగా ప్రస్తుతం బీజేపీ దేశంలో ఐక్యతను దెబ్బతీస్తూ ప్రాంతీయ, మత విద్వేషాలను రెచ్చగొడుతుంది. దీనికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని కాంగ్రెస్ తీర్మానించింది. బ్రిటిష్ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడిన సర్దార్ వల్లభాయ్ పటేల్ ను కాంగ్రెస్ స్ఫూర్తిగా తీసుకొని ప్రస్తుత బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చింది. మన్మోహన్ సింగ్ ప్రభుత్వం దూరదృష్టితో తెచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని నరేంద్ర మోదీ సర్కార్ నీరుగారుస్తున్న అంశాన్ని గుర్తించిన కాంగ్రెస్ దీన్ని తప్పు పట్టింది.

> **జవహర్ లాల్ నెహ్రూ మార్గదర్శకంలో సర్దార్ వల్లభాయ్ నేతృత్వంలో దేశంలో 560 పైగా పలు సంస్థానాలను దేశంలో విలీనం చేసి భారత్ ను బలోపేతం చేయగా ప్రస్తుతం బీజేపీ దేశంలో ఐక్యతను దెబ్బతీస్తూ ప్రాంతీయ, మత విద్వేషాలను రెచ్చగొడుతుంది. దీనికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని కాంగ్రెస్ తీర్మానించింది. బ్రిటిష్ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడిన సర్దార్ వల్లభాయ్ పటేల్ ను కాంగ్రెస్ స్ఫూర్తిగా తీసుకొని ప్రస్తుత బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చింది.**

> **బీజేపీ పాలనలో పేదవాడు మరింత పేదవాడిగా మారితే ధనవంతులు మరింత ధనవంతులయ్యారు. బడా వ్యాపారస్తులు బ్యాంకు రుణాలను ఎగ్గొట్టి దేశం విడిచి పారిపోతుంటే బీజేపీ సహకరిస్తుంది. దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగి ప్రజల మధ్య అంతరం పెరగడంపై ఏఐసీసీ అసంతృప్తి వ్యక్తం చేసింది. మహాత్మాగాంధీ హత్యానంతరం వల్లభాయ్ పటేల్ ఆర్ఎస్ఎస్ ను నిషేధిస్తే, ఇప్పుడు బీజేపీ ఆర్ఎస్ఎస్ మార్గదర్శకత్వంలో దేశాన్ని పాలించడం దురదృష్టకరం.**

విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజల్లో అభద్రతా భావం కల్పిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సామాజిక న్యాయం కోసం పోరాడాలని కాంగ్రెస్ తీర్మానించింది. గతంలో బ్రిటిష్ పాలకులు దేశ వనరులను, సంపదన అక్రమంగా దోచుకుంటే, ఇప్పుడు బీజేపీ కూడా కార్పొరేట్ రంగాలకు దేశ వనరులను, సంపదను దోచిపెడుతోంది. బీజేపీ పాలనలో పేదవాడు మరింత పేదవాడిగా మారితే ధనవంతులు మరింత ధనవంతులయ్యారు. బడా వ్యాపారస్తులు బ్యాంకు రుణాలను ఎగ్గొట్టి దేశం విడిచి పారిపోతుంటే బీజేపీ సహకరిస్తుంది. దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగి ప్రజల మధ్య అంతరం పెరగడంపై ఏఐసీసీ అసంతృప్తి వ్యక్తం చేసింది. మహాత్మా గాంధీ అహింసా మార్గాన్ని స్ఫూర్తితో దేశంలో హింసా, మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని అహ్మదాబాద్ లో తీర్మానం చేశారు. మహాత్మాగాంధీ హత్యానంతరం వల్లభాయ్ పటేల్ ఆర్ఎస్ఎస్ ను నిషేధిస్తే, ఇప్పుడు బీజేపీ ఆర్ఎస్ఎస్ మార్గదర్శకత్వంలో దేశాన్ని పాలించడం దురదృష్టకరం.

జాతీయత పేరుతో బీజేపీ, ఆర్ఎస్ఎస్ సృష్టిస్తున్న కుల, మత, ప్రాంత రాజకీయాలను సమావేశంలో పార్టీ ఎండగట్టింది. కాంగ్రెస్ జాతీయ వాదం దేశ ప్రజలను ఏకం చేస్తే, బీజేపీ జాతీయ వాదం భారత సమాజాన్ని విభజిస్తోంది. భావోద్వేగాలను రెచ్చగొట్టే ఎజెండాతో బీజేపీ మైనార్టీల్లో అభద్రతాభావం కల్పిస్తుంది. ముస్లిం మైనార్టీలపై కక్షగట్టిన బీజేపీ మతపరమైన అంశాల్లో జోక్యం చేసుకుంటూ వక్ఫ్ బోర్డు చట్టానికి సవరణలు చేసి వారి మనోభావాలను భంగం కలిగించింది. యూపీ, మహారాష్ట్ర, మణిపూర్ రాష్ట్రాల్లో సున్నితమైన అంశాలను తెరపైకి తెస్తూ మతకలహాలను సృష్టించడమే కాకుండా ఉన్నత న్యాయ స్థానం తప్పుపడుతున్నా బుల్డోజర్ పాలన సాగిస్తోంది. మైనార్టీల్లో విశ్వాసం, భరోసా కలిగించేందుకు ముందుండి వారికి రక్షణగా నిలవాల్సిన ఆవశ్యకతను కాంగ్రెస్ గుర్తించింది.

జనాభాలో అధిక శాతం ఉన్న నిరుపేద బడుగు, బలహీన వర్గాలకు సామాజిక న్యాయం దక్కేలా కాంగ్రెస్ బీజేపీ ప్రభుత్వానికి పలు సూచనలు, సలహాలు ఇస్తున్నా వారు పెడచెవిన పెడుతున్నారు. నిబంధనల ప్రకారం 2021లో చేపట్టాల్సిన జనగణనను వెంటనే నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ పలు వేదికలపై డిమాండ్ చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా వాయిదాలేస్తోంది. రిజర్వేషన్లపై ప్రస్తుతమున్న 50 శాతం సీలింగ్ ఎత్తివేసేందుకు తక్షణమే జనగణన చేపట్టి అందులో భాగంగా కులగణన కూడా నిర్వహించాలని కాంగ్రెస్ కోరుతోంది. కులగణన చేపడితే జనాభా ఆధారంగా సంబంధిత సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు కల్పించేందుకు అవకాశం ఉంటుందని, సామాజిక న్యాయం కోసం దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలని ఏఐసీసీ డిమాండ్ చేసింది. పార్టీ అధినేత రాహుల్ గాంధీ గతంలో చేపట్టిన భారత్ జోడో యాత్ర సందర్భంగా దేశంలో కులగణన ఆవశ్యకతను గుర్తించి కేంద్ర ప్రభుత్వానికి పలు సూచనలు చేసినా పట్టించుకోలేదు.

కులగణనపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్పందించకపోవడంతో కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో ప్రయోగాత్మకంగా శాస్త్రీయ పద్ధతిలో కులగణనను విజయవంతంగా పూర్తి చేసి దేశానికే ఆదర్శంగా నిలిచింది. కులగణన చేపట్టడమే కాకుండా దానికి అనుగుణంగా బడుగు బలహీన వర్గాలకు ఆ ఫలాలు అందాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి సర్కార్ తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్య, ఉపాధి రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో చారిత్రాత్మకమైన బిల్లును ఆమోదించింది. ఈ బిల్లుకు చట్టబద్ధత కల్పించడం ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేతిలో ఉన్నా నిర్లక్ష్య ధోరణితో ఉన్నారు. అహ్మదాబాద్ వేదికగా తెలంగాణ కులగణనను ఏఐసీసీ అభినందించడం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అందరికీ గర్వకారణం.

రాష్ట్రాల మధ్య పక్షపాతం చూపిస్తూ బీజేపీ ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తిగా విరుద్ధంగా పాలిస్తోంది. బీజేపీ విద్వేష ఎజెండాను రాష్ట్రాల అనుమతి లేకుండా ఒంటెత్తు పోకడలతో అన్ని రాష్ట్రాలపై రుద్దడాన్ని ఏఐసీసీ తప్పుపట్టింది. జీఎస్టీతో రాష్ట్రాల మధ్య నిధుల కేటాయింపులలో వివక్ష చూపిస్తోంది. ప్రధానంగా బడ్జెట్ కేటాయింపుల్లో ఎన్డీఏ యేతర రాష్ట్రాలకు అన్యాయం చేస్తుంది. తెలంగాణకు గత 11 ఏళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడ్జెట్లో గుండు సున్నానే ఇచ్చింది. విభజన హామీలు, నిధులు, పథకాల కేటాయింపులో కూడా తెలంగాణపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ఉన్న సవతి తల్లి ప్రేమ తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏఐసీసీ పిలుపు మేరకు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వివక్షకు గురవుతున్న తెలంగాణలో రాష్ట్ర కాంగ్రెస్ శ్రేణులు పోరాడాల్సిన ఆవశ్యకత ఉంది.

స్వతంత్రంగా ఉండాల్సిన ప్రభుత్వ వ్యవస్థలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి వాడుకుంటోంది. పలు రాష్ట్రాల్లో ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకొని ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా విచారణ పేరుతో వేధిస్తోంది. చివరికి పారదర్శకంగా ఉండాల్సిన ఎన్నికల సంఘంపై అనుమానాలు రేకెత్తించేలా బీజేపీ వ్యవహరిస్తుంది. హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని పలు రాజకీయ పార్టీలు వ్యక్తం చేసిన సందేహాలను నివృత్తి చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సంస్థలు జవాబుదారీగా ఉండాలని ఏఐసీసీ అభిప్రాయ పడిరది. మరోవైపు అమెరికా భారత్ పై విధిస్తున్న సుంకాలపై తగిన రీతిలో స్పందించకుండా నరేంద్ర మోదీ మౌనం దాల్చడంపై కాంగ్రెస్ తప్పుపట్టింది. బీజేపీ ప్రభుత్వం చేతకానితనంతో ఇప్పటికే ఆర్థికంగా కుదేలైన భారత్ అమెరికా సుంకాలపై వ్యూహాత్మకంగా వ్యవహరించకపోతే దేశ ప్రజలకు మరిన్ని కష్టాలు తప్పవు.

అన్ని వర్గాలకు అన్యాయం చేస్తూ పరిపాలిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, లౌకికవాదం, సామాజిక న్యాయం పరిరక్షణకు కృషి చేయాలని 'న్యాయపథ్' పేరిట ఏఐసీసీ అహ్మదాబాద్ వేదికగా పిలుపిచ్చింది. మైనార్టీలలో అభద్రతాభావం కల్పిస్తూ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేయిచేయి కలిపి దేశ భావితరాలకు భవిష్యత్ పై భరోసా కల్పించాల్సిన గురుతర బాధ్యత కాంగ్రెస్ శ్రేణులపై ఉంది.

> **యూపీ, మహారాష్ట్ర, మణిపూర్ రాష్ట్రాల్లో సున్నితమైన అంశాలను తెరపైకి తెస్తూ మతకలహాలను సృష్టించడమే కాకుండా ఉన్నత న్యాయ స్థానం తప్పుపడుతున్నా బుల్డోజర్ పాలన సాగిస్తోంది. మైనార్టీల్లో విశ్వాసం, భరోసా కలిగించేందుకు ముందుండి వారికి రక్షణగా నిలవాల్సిన ఆవశ్యకతను కాంగ్రెస్ గుర్తించింది.**

> **కులగణనపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్పందించకపోవడంతో కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణ లో ప్రయోగాత్మకంగా శాస్త్రీయ పద్ధతిలో కులగణనను విజయవంతంగా పూర్తి చేసి దేశానికే ఆదర్శంగా నిలిచింది. అహ్మదాబాద్ వేదికగా తెలంగాణ కులగణనను ఏఐసీసీ అభినందించడం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అందరికీ గర్వకారణం.**

> **అన్ని వర్గాలకు అన్యాయం చేస్తూ పరిపాలిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, లౌకికవాదం, సామాజిక న్యాయం పరిరక్షణకు కృషి చేయాలని 'న్యాయపథ్' పేరిట ఏఐసీసీ అహ్మదాబాద్ వేదికగా పిలుపిచ్చింది. మైనార్టీలలో అభద్రతాభావం కల్పిస్తూ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేయిచేయి కలిపి దేశ భావితరాలకు భవిష్యత్ పై భరోసా కల్పించాల్సిన గురుతర బాధ్యత కాంగ్రెస్ శ్రేణులపై ఉంది.**

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

**మీ రచనలు పంపాల్సిన చిరునామా:**
mahaapatrika@gmail.com
whatsapp- 74369 39999

# మహాత్మా జ్యోతిరావు పూలే అణగారిన వర్గాల ఆశాజ్యోతి...!

మహాత్మా జ్యోతిరావు గోవిందరావు పూలే 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలోని పూణె జిల్లా సతారా ప్రాంతంలోని ఖాన్వాడి గ్రామంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు గోవిందరావు మరియు చిమణాబాయి మాలి (కుల వృత్తి పూలమాలలు తయారు చేసేవారు) కుటుంబంలో జన్మించిన జ్యోతిరావు చిన్నతనంలోనే తల్లిని కోల్పోయారు. ఆయన తండ్రి సాధారణ రైతు కుటుంబీకుడైనప్పటికీ, జ్యోతిరావు విద్యాభిలాషను గుర్తించి చదువుకు ప్రోత్సాహం అందించారు. బాల్యంలో స్థానిక మరాఠీ పాఠశాలలో విద్యాభ్యాసం ప్రారంభించిన ఆయన, కుల వివక్షను ఎదుర్కొన్న అనుభవాలు భవిష్యత్తులో ఆయన జీవిత లక్ష్యాన్ని రూపొందించాయి. జ్యోతిరావు పూలే మరాఠీ, గుజరాతీ, ఆంగ్ల భాషల్లో ప్రాథమిక విద్యను పూణెలోని స్కాటిష్ మిషనరీ స్కూల్లో 1847లో పూర్తి చేశారు. విద్య ద్వారా సమాజంలో చైతన్యం తెచ్చే ఆలోచన ఆయనలో బలంగా నాటుకుంది. 1840లో, 13 ఏళ్ల వయసులో సావిత్రిబాయిని వివాహం చేసుకున్నారు. సావిత్రిబాయి ఆయన సంస్కరణ ఉద్యమంలో సమాన భాగస్వామిగా నిలిచారు. ఆమెకు విద్య నేర్పడం ద్వారా జ్యోతిరావు పూలే తన సామాజిక లక్ష్యాలను ప్రారంభించారు. ఆనాటి సమాజంలో మహిళలు, ముఖ్యంగా అణగారిన కులాల స్త్రీలు విద్యకు దూరంగా ఉండటం జ్యోతిరావును కలచివేసింది. 1848లో పూణెలో భారతదేశంలోనే తొలి బాలికల పాఠశాలను స్థాపించారు. ఈ పాఠశాలలో సావిత్రిబాయి పూలే ఉపాధ్యాయురాలిగా వ్యవహరించారు. ఈ చర్య ఆనాటి సంప్రదాయవాదుల నుండి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంది. ఆడపిల్లలు చదువుకోవడం అనాగరికం అని భావించిన సమాజంలో ఈ ప్రయత్నం విప్లవాత్మకమైనది. 1852 నాటికి మూడు బాలికల పాఠశాలలను స్థాపించి, విద్యా వ్యాప్తికి బీజం వేశారు.





కుల వ్యవస్థ దుష్ప్రభావాలను ఎదుర్కొనేందుకు జ్యోతిరావు 1873లో 'సత్యశోధక్ సమాజ్' (సత్యాన్వేషణ సమాజం) స్థాపించారు. ఈ సంస్థ లక్ష్యం సత్యం, సమానత్వం, మానవత్వంతో కూడిన సమాజ నిర్మాణం. బ్రాహ్మణాధిక్యతను వ్యతిరేకిస్తూ, అణగారిన వర్గాలను చైతన్యం చేయడం దీని ప్రధాన ఉద్దేశం. ఈ సంస్థ ద్వారా కుల ఆధారిత వివక్షను తిరస్కరించి, శూద్రులు, అతి శూద్రుల సామాజిక హక్కుల కోసం గళమెత్తారు. జ్యోతిరావు పూలే సామాజిక అన్యాయాలపై అవిశ్రాంతంగా పోరాడారు. వితంతువుల పునర్వివాహాలను ప్రోత్సహించడం కోసం 1850లలో ఒక ఆశ్రమాన్ని స్థాపించారు. అంటరానితనాన్ని రూపుమాపేందుకు దళితుల ఇళ్లలో నీళ్లు తాగడం, వారితో జీవించడం వంటి సాహసోపేత చర్యలు చేపట్టారు. రైతుల సమస్యలపై కూడా ఆయన దృష్టి సారించారు. బ్రిటిష్ ప్రభుత్వానికి రైతుల దుర్భర పరిస్థితులను వివరిస్తూ అనేక లేఖలు రాశారు.

**రచనలు మరియు ఆలోచనలు**

జ్యోతిరావు పూలే తన ఆలోచనలను రచనల ద్వారా వ్యక్తీకరించారు. 1873లో రాసిన 'గులామగిరి' (బానిసత్వం) పుస్తకం కుల వ్యవస్థపై తీవ్ర విమర్శ చేస్తూ, బానిసత్వ విముక్తి కోసం పిలుప నిచ్చింది. 'శేతకర్యా చా ఆసూడ్' (రైతు కొరడా) రచనలో రైతుల దుస్థితిని వివరించారు. ఆయన రచనలు సామాజిక అసమానతలను ఎత్తిచూపడమే కాక, పరిష్కార మార్గాలను సూచించాయి.

**చివరి దశ మరియు మరణం**

సామాజిక సంస్కరణల కోసం జీవితమంతా పనిచేసిన జ్యోతిరావు 1888లో పక్షవాతంతో బాధపడ్డారు. అయినప్పటికీ, తన ఆలోచనలను వ్యాప్తి చేయడం ఆపలేదు. 1890 నవంబర్ 28న పూణెలో ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన మరణం సమాజ సంస్కరణ ఉద్యమంలో ఒక శూన్యతను సృష్టించినప్పటికీ, ఆయన ఆశయాలు లక్షలాది మందికి స్ఫూర్తిగా నిలిచాయి. మహాత్మా జ్యోతిరావు పూలేకు బ్రిటిష్ ప్రభుత్వం 'మహాత్మా' బిరుదు ఇచ్చి సత్కరించింది. ఆయన ఆలోచనలు డా. బి.ఆర్. అంబేద్కర్ వంటి సంస్కర్తలకు స్ఫూర్తినిచ్చాయి. విద్య, సమానత్వం, న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం నేటికీ సమాజంలో అసమానతలను తొలగించే దిశగా దారి చూపుతోంది. జ్యోతిరావు ఒక వ్యక్తి కాదు, అణగారిన వర్గాల గుండె చప్పుడుగా మారిన విప్లవ జ్యోతి.

- ప్రొద్దువాక భీమా రావు, 9948635844

## నిరుపేదలు, రైతుల ఆర్థిక ప్రగతికి సహకార సంఘాలు కృషి చేయాలి

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**



**జనగామ, మహా:** నిరుపేదలు, రైతుల ఆర్థిక ప్రగతి పెంచేందుకు సహకార సంఘాలు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సహకార సంఘాల కార్యకలాపాల పనితీరును అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. నూతన సహకార సంఘాల ఏర్పాటు ఆవశ్యకతను సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ...సహకార సంఘాల పరిధిలోని వివిధ వృత్తి కుటుంబాలను బలోపేతం చేసేందుకు గ్రామస్థాయిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతుసేవా సహకార సంఘాలు, పాలఉత్పత్తుల సహకార సంఘాలు, మత్స్యసహకార సంఘాలు, కల్లుగీతకార్మిక సంఘాల ద్వారా విస్తృత సేవలు అందించాలన్నారు. గ్రామీణప్రాంత ప్రజలకు మరింత సేవలందించడానికి మరిన్ని సహకార సంఘాల ఏర్పాటు చేయాలన్నారు. రైతు ఉత్పత్తి కేంద్రాలను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలో ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకతను అధికారులతో సమీక్షిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలనుసరించి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు తమ వ్యాపార పరిధి అవకాశాలను మరింత పెంచుకొని స్వయం సమృద్ధి సాధించాలని తద్వారా రైతులు, గ్రామీణ ప్రజలకు మరింత సేవలందించవచ్చునని అభిప్రాయం వ్యక్తం చేశారు. మత్స్యసహకార సంఘాలు, పాల ఉత్పత్తుల సహకార సంఘాలు తమ వ్యాపార పరిధిని పెంచుకొని సంబంధిత వృత్తి గ్రామీణ ప్రజలకు మరింత సేవలందించవలసిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో జడ్పీ డిప్యూటీ సీఈవో సరిత, జిల్లా సహకార శాఖ అధికారి రాజేందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్, జిల్లా మత్స్యశాఖ అధికారి రాణా ప్రతాప్, పశుసంవర్ధన శాఖ అధికారి రాధా కిషన్, నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, విజయడైరీ అధికారి సత్యనారాయణ, డిసిసిబి అధికారి అశోక్, సహకార శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి

**అబ్దుల్లాపూర్ మెట్, మహా:** మున్సిపాలిటి పరిధిలో మంచినీటి సమస్య తలెత్తకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. గురువారం తుర్కయంజాల్ మున్సిపాలిటి పరిధి రాగన్నగూడలోని ఓ ఫంక్షన్ హాల్లో మున్సిపాలిటిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాలపై ఎమ్మెల్యే అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భముగా పలువురు నీటి సమస్య, పారిశుధ్య సమస్యతో పాటుగా పలు శాఖల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకోని వచ్చారు. ముఖ్యంగా కొహెడలో మంచినీటి సమస్య అధికంగా ఉందని వెంటనే పరిష్కరించాలని కొహెడ వాసులు ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటి పరిధిలోని ప్రతి కాలనీలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మున్సిపాలిటి జనాభాకు అనుగుణంగా కృష్ణానీటి సరఫరాను పెంచాలని ఆయన ఆదేశించారు. అదే విధముగా రాజీవ్ గృహకల్ప కాలనీలో కబ్జాదారులు తిరుగుతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయని రాజీవ్ గృహకల్ప లబ్ధిదారుల సమాచారం పూర్తిగా సేకరించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు.. ఈ కార్యక్రమంలో అబ్దుల్లాపూర్ మెట్ మండల తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి, తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీపీని కలిసిన అటవీ, ఎక్సైజ్ అధికారులు



**హన్మకొండ, మహా:** వరంగల్ జిల్లా అటవీశాఖ అధికారి అనోజ్ అగర్వాల్, ఎక్సైజ్ విభాగం డిప్యూటీ కమిషనర్ అంజన్ రావు లు గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్చాలను అందజేశారు.

**వాహనాలను తీసుకవెళ్ళండి పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ ఘటనల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను యజమానులకు అప్పగించడానికి నిర్ణయించినట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను హనుమకొండ భీమారం, సి.ఆర్ పి.ఎఫ్ కేంద్రంలో భద్రపర్చారు. వాటిని పోలీస్ స్టేషన్ల వారిగా గుర్తించి సబంధిత వాహన యజమానులకు నోటీసులు కూడా పంపారు. తగిన ఆధారాలతో వచ్చిన యజమానులకు వాహ నాలను తిరిగి అందజేయనున్నారు. మరింత సమాచారం కోసం సెల్ నంబర్లు 8712685143, 8712685158, 8712584557, యజమానులు సంప్రదించాలని పోలీస్ కమిషనర్ ఓ ప్రకటనలో తెలిపారు.

## జాబ్ మేళా విజయవంతానికి సమన్వయంతో పనిచేయండి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద**



**వరంగల్ మహా:** జాబ్ మేళా విజయవంతానికి వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అభిప్రాయపడ్డారు. శుక్రవారం వరంగల్ తూర్పు నియోజక వర్గ పరిధి లోని ఏం కే నాయుడు కన్వెన్షన్ హాల్ వరంగల్ లో నిర్వహించనున్న జాబ్ మేళా ఏర్పాట్లను గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే తో కలిసి క్షేత్ర స్థాయి లో పర్యటించి జాబ్ మేళా ను విజయవంతం చేయడం పై వివిధ విభాగాల ఉన్నతాధికారులు సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అధికారులు వాలంటీర్స్ తో ఏర్పాటు చేసిన సమావేశం లో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మాత్యులు కొండా సురేఖ ప్రత్యేక చొరవ తీసుకొని ప్రతిష్టాత్మకంగా టాస్క్ వారి సౌజన్యంతో సుమారు 65 మల్టీ నేషనల్ కంపెనీలను భాగస్వాములను చేస్తూ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు సుమారు 10 వేల మంది హాజరయ్యే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం బల్దియా సమన్వయంతో పనిచేసి జాబ్ మేళాను విజయవంతం చేయాల్సి ఉందని ఇందుకోసం ఫైర్ సేఫ్టీ కి, ఫస్ట్ ఎయిడ్, ఫుడ్ స్టాల్ ఏర్పాట్లతో పాటు మాతృమూర్తుల సౌకర్యార్థం ఫీడింగ్ రూము తో పాటు వయోవృద్ధులకు విశ్రాంతి కోసం ఏర్పాట్లు చేయాలని, బ్యాంక్ లింకేజీ రాజీవ్ యువ వికాసం సంబంధిత కేంద్రం ఐ సి డి ఎస్ వారికి సంబంధించిన ఏర్పాటు చేసిన స్టాళ్లను కూడా పరిశీలించారు. జాబ్ మేళా లో పాల్గొనే అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వీలుగా గ్రౌండ్ ఫ్లోర్ లో 20 హెల్ప్ డెస్కు స్టాళ్లను అలాగే రెండవ అంతస్తులో 30 హెల్ప్ డెస్క్ స్టాళ్లను ఏర్పాటు చేసి వివిధ జాబ్ లకు మెడికల్ ఐటి ఫార్మా అగ్రి ఇంజనీరింగ్ (ట్రేడ్స్) చెందిన అభ్యర్థుల కోసం వాలంటీర్స్ ద్వారా అవగాహన కలిగించి సంబంధిత విభాగాలకు చేరుకునేలా గైడ్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖమంత్రుల ప్రత్యేక అధికారి శ్రీరాములు, శ్రీనివాస్, జిల్లా ప్రోగ్రాం నోడల్ అధికారి రామ్ రెడ్డి, సి ఏం హెచ్ ఓ డా.రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, రాజేశ్వర్, ఎల్డిఎం రాజు, వివిధ సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

## మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం

- గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి
- పాలకవర్గం, అధికారులతో కలసి మార్కెట్ కి వచ్చిన మామిడిని పరిశీలన



**అబ్దుల్లాపూర్ మెట్,మహా:** గడ్డి అన్నారం మార్కెట్ కు వచ్చే మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి అన్నారు. గురువారం ఉదయం పాలకవర్గం, అధికారులతో కలిసి బాట సింగారం మార్కెట్ యార్డ్ కు వచ్చిన మామిడి క్రయవిక్రయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ... మార్కెట్ కి వచ్చే మామిడి రైతులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. రైతుల ప్రయోజనాలే మాకు ముఖ్యమని.. గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం మామిడి దిగుబడి అధికంగా ఉందన్నారు. రైతుల ప్రయోజనాలే మాకు ముఖ్యమని అన్నారు. రైతులకు మంచి గిట్టుబాటు అందించేలా అధికారులు చొరవ చూపాలని సూచించారు. రోజుకు 800 వాహనాలు మార్కెట్ కి వస్తున్న తరుణంలో ట్రాఫిక్ కి ఇబ్బంది కలగాకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ భాస్కరచారి చారి, డైరెక్టర్లు బండి మధుసూదన్ రావు, అంజయ్య, నవరాజ్, గణేష్ నాయక్, రఘుపతి రెడ్డి, మేకం లక్ష్మి, గోవర్ధన్ రెడ్డి, మచ్చేందర్ రెడ్డి, నరసింహ, ఎండి ఇబ్రహీం, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్, హర్ష, విజయ్, మురళి, శ్రీను, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



## దుండగుల కత్తిపోట్లకు గురైన మహిళ మృతి

**ఎల్బీనగర్,మహా:** గత మూడు రోజుల క్రితం ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సరూర్ నగర్ పోస్ట్ ఆఫీస్ వెళ్లే దారిలో ఉన్న రిషి కిచెన్ వెనుక భాగంలో గుర్తు తెలియని దుండగుల చేతిలో హత్యా యత్నానికి గురైన వద్ద్య లక్ష్మీ(40) దిల్సుఖ్ నగర్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 8న (మంగళవారం) తెల్లవారుజామున బడంగ్ పేట్ కు చెందిన వద్ద్య లక్ష్మీ 12:20 గంటలకు ఎల్బీనగర్ నుండి సరూర్ నగర్ పోస్ట్ ఆఫీస్ కార్యాలయం వెళ్లే దారిలో ఉన్న రిషి కిచెన్ వెనుక భాగంలో మరి కొందరు మహిళతో కలిసి వేచి ఉంది. ఇదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి లక్ష్మిపై కత్తులతో విచక్షణ రహితంగా దాడి చేశారు.దీంతో ఆమె తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో పడి ఉండడంతో ఆమెను గుర్తించిన ఆటో డ్రైవర్ రవి దిల్సుఖ్ నగర్ లోని కృతిక హాస్పిటల్లో మార్కెటింగ్ లో పనిచేసే ఆమె అల్లుడు పానుగోతు బాబుకు సమాచారం ఇచ్చాడు. అతను వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం కృతిక హాస్పిటల్ కు తరలించారు. సమాచారం అందుకున్న ఎల్బీనగర్ పోలీసులు సంఘటన స్థలానికి, కృతిక హాస్పిటల్ కు చేరుకుని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి వివరాలు సేకరించారు.ఈ ఘటనతో పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న సమయంలోనే గురువారం రాత్రి 2 గంటల సమయంలో లక్ష్మీ మృతి చెందింది. లక్ష్మీ గతంలో పోలీసుల థర్డ్ డిగ్రీ బాదితురాలు 2023లో ఎల్బీనగర్ సంచలనం సృష్టించిన గిరిజన మహిళపై పోలీసుల థర్డ్ డిగ్రీ బాదితురాలే..ఈ లక్ష్మీ.

## పౌష్టికాహారం తోనే రక్తహీనత దూరం



**కాటారం, మహా:** గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చునని దేవరంపల్లి అంగన్వాడి టీచర్ కమలాదేవి సూచించారు గురువారం పోషణ పక్వాడ్ పక్షోత్సవాల సందర్భంగా అంగన్వాడి కేంద్రంలో పోషకాహారం పై అవగాహన కల్పించారు. విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. బిడ్డ రెండు సంవత్సరాలు నిండే వరకు తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు మొదటి 1000 రోజులు పిల్లల ఎదుగుదలకు ఎంతో ప్రాధాన్యత ఉందని పిల్లలకు ఎలాంటి మానసిక శరీర సమస్యలు ఎదురుకాకుండా ఉండేందుకు సరైన పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని అంగన్వాడి టీచర్ ఎల్ కమలా దేవి తెలిపారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించడం వల్ల రోగ నిరోధక శక్తి పెరిగి పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. గర్భిణీల ఎత్తు బరువు వంటి కొలతలు వేసి నమోదు చేసుకున్నారు. అనంతరం పౌష్టికాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. గర్భిణీలకు బాలింతలకు పిల్లలకు తల్లిదండ్రులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇన్ఫెక్షన్స్ రాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించాలని వంట పాత్రలు ఆహారము చేసుకునే పాత్రలు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు కిషోర్ బాలికలకు హిమోగ్లోబిన్ మందు బిల్లల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తల్లులు,గ్రూపు సభ్యులు, కిశోర బాలికలు, ప్రజలు పాల్గొన్నారు.

## షాధికానా ఫంక్షన్ హాల్ నిర్మాణా పనులను ప్రారంభించిన కార్పొరేటర్



**వరంగల్ మహా:** వరంగల్ తూర్పు నియోజకవర్గం 13వ డివిజన్ ఎల్బీనగర్ లోని ఉర్దూ భవన్ షాధికానా ఫంక్షన్ హాల్ స్లాబ్ నిర్మాణా పనులను గురువారం స్థానిక కార్పొరేటర్ సురేష్ కుమార్ జోషి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ జోషి కాంట్రాక్టర్ కు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పలు సూచనలు చేశారు.

## "పోషణ పక్షం" విజయవంతం చేయాలి



**ములుగు, మహా :** పోషకాహార ప్రాముఖ్యతపై ఈనెల 22 వరకు నిర్వహించనున్న పోషణ పక్షం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తన ఛాంబర్లో జిల్లా పోషణ పక్షం గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోషణ పక్షం2025 కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఈ నెల 8 నుండి 22 వరకు మహిలాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆద్వర్యంలో వివిధ శాఖల సమన్వయం తోఅంగన్వాడి కేంద్రం, ప్రాజెక్ట్ మరియు జిల్లా స్థాయిలో (4) రకాల ప్రతి పాదిత నేపద్యాలు(మొదటి 1000 రోజులపై దృష్టి, లబ్దిదారుల మాడ్యుల్ ను ప్రజాదరణ పెంపొందించడం, పిల్లల్లో ఉభకాయాన్ని తగ్గించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి) పైన వివిధ రకాలైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 4 ఐ సి డిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న 640 అంగన్వాడి కేంద్రంలలో ఆరు సంవత్సరంల లోపు చిన్నారులలో, గర్భిణులు, బాలింతలలో పోశాకాహరలోపంతో భాధ పడుతున్న వారిని గుర్తించి అంగన్వాడి కేంద్రాల ద్వార అందిస్తున్న పోషకాహారం ఇతర సేవలను పూర్తిగా వినియోగించుకోనేల అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్ జి, జిల్లా సంక్షేమ అధికారిణి శిరీష, డి ఎం అండ్ హెచ్ ఓ గోపాల్ రావు, డి పి ఆర్ ఓ రఫీక్, తహసీల్దార్ విజయ భాస్కర్, సూపర్ వైజర్, పోషణ్ అభియాన్ కో ఆర్డి నేటర్స్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిష్టాత్మకంగా రాజీవ్ యువ వికాస పథకం

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**కాటారం, మహా :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ వికాస పథకం సద్వినియోగం చేసుకోవాలని ఈనెల 14వ తేదీ తో ప్రక్రియ ముగుస్తుందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం కాటారం ఎంపిడిఓ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు వివరాలు తప్పని సరిగా రిజిస్టర్ లో నమోదు చేసి, దరఖాస్తుదారునికి రశీదు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి ఆన్లైన్, ఆఫ్ లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరణ పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు తీసుకోవడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ ను పరిశీలించారు. పథక యూనిట్లు వివరాల ఫ్లెక్సీ ఏర్పాటుతో హెల్ప్ డెస్క్ ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని ఎంపిడిఓను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా భూపాలపల్లి మున్సిపల్ కార్యాలయం, అన్ని ఎంపిడిఓ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ లలో నేరుగా దరఖాస్తులు కూడా ఇవ్వొచ్చని తెలిపారు. దరఖాస్తులు ఉచితంగా ఇవ్వబడతాయని తెలిపారు. దరఖాస్తుదారులు ఆధార్, రేషన్ కార్డ్ లేదా ఆదాయ ధృవీకరణ పత్రం, కుల ధృవీకరణ పత్రంతో కలిపి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును రిజిస్టర్ లో నమోదు చేసి తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని ఆదేశించారు. ఆన్లైన్ చేసిన దరఖాస్తు దారుని నుండి దరఖాస్తు తీసుకుని భద్రపరచాలని సూచించారు. దరఖాస్తులు జాగ్రత్తగా భద్రపరచాలని ఏ ఒక్కటి మిస్ కావొద్దని తెలిపారు. ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్క సామాజిక వర్గానికి విడివిడిగా రిజిస్టర్ లోవివరాలు నమోదు చేసి దరఖాస్తుదారులకు రశీదు ఇవ్వాలని స్పష్టం చేశారు. రాజీవ్ యువ వికాసం పథకంలో 50 వేల నుంచి 4 లక్షల రూపాయలు వరకు సబ్సిడీ యూనిట్లు ఏర్పాటుకు అవకాశం ఉందని తెలిపారు. ఈ నెల 14వ తేదీ వరకు మాత్రమే దరఖాస్తు చేసేందుకు అవకాశం ఉన్నందున విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. వ్యవసాయేతర యూనిట్లకు 21 నుంచి 55 సంవత్సరాలు, వ్యవసాయ యూనిట్లకు 21 నుండి 60 సంవత్సరాల వయసున్న వారు అర్హులని తెలిపారు. ఎంపిడిఓ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉన్నట్లు గమనించిన జిల్లా కలెక్టర్ సిబ్బంది ఖాళీల వివరాలు అందచేయాలని ఎంపిడివోను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఎంపిడిఓ బాబు, డిటి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు - ఆటో ఢీ



**కరీంనగర్ ,మహా :** కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధురనగర్ లో ఆటో ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటన కలకలం రేపింది. ఆటోలో అక్రమంగా తరలిస్తున్న పేలుడు పదార్థాలు బయట పడ్డాయి. కరీంనగర్ వైపు నుండి జగిత్యాలకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు టి జి02T1770 జగిత్యాల వైపు నుండి కరీంనగర్ వైపు వెళ్తున్న ఆటో ఎపి36TB5246 ఎపిP 36W6231(దొంగ నెంబర్) మధురానగర్ వద్ద ఢీకొనగ ఆర్టీసీ ముందు భాగం డామేజ్ అయ్యింది. ఆటో లో ఉన్న జిలెటన్ స్టిక్స్ కిందపడగా స్థాయినికులు ఇవి ఏమిటని ప్రశ్నించగా డ్రైవర్ అక్కడ నుండి పారిపోయినాడు. బస్ డ్రైవర్ మెరుగు శ్రీనివాస్ ఫిర్యాదు చేయగా పోలీసులు గుర్తు తెలియని ఆటో డ్రైవర్ పై కేసు నమోదు చేయడం జరిగింది. పోలీసుల తనిఖీల్లో జిలెటిన్ స్టిక్స్ మొత్తం 400, వీటి విలువ 8,000 రూపాయలు, వీటితో పాటు డీ .డికార్డ్ వైర్ బెండల్ సైతం దొరికింది. దీని విలువ సుమారు 4,500 రూపాయలు పై మొత్తం ప్రేలుడు పదార్థాల విలువ 12,500 వరకు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న గుర్తు తెలియని ఆటో డ్రైవర్ పై కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు.

## ఖాకీలో అవినీతి పంట.. సీఐ లంచం లీక్..!

- సీఐ, గన్‌మెన్‌కి ఏసీబీ లాక్అప్
- ప్రైవేట్ ఖాతాలో లంచం... పోలీస్ స్టేషన్‌కు మచ్చ



**భద్రాచలం, మహా:** తెలంగాణలో అవినీతి పరంపర ఇంకా ఆగలేదు. ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసు శాఖ సిబ్బంది సామాన్య ప్రజల నుంచి లంచం తీసుకుంటూ తమ పదవులను దుర్వినియోగం చేసుకుంటున్నారు. భద్రాచలం పోలీస్‌స్టేషన్‌లో తాజాగా వెలుగులోకి వచ్చిన అవినీతి ఘటన దీనికి నిదర్శనం. సీఐ గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న రామారావు అనే కానిస్టేబుల్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఘటన స్థానికంగా సంచలనం రేపింది. అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీని వదిలేందుకు డబ్బులు డిమాండ్ చేసిన రామారావు, ఆ లంచాన్ని సొంతంగా ఖాతాలో తీసుకోవడం, అందులో ఇతరుల ప్రమేయం పై ఏసీబీ విచారణ జరుపుతున్న తీరునే చూస్తే, లోపలి వ్యవస్థలో ఎన్నో అనుమానాస్పద సంబంధాలున్నాయని స్పష్టమవుతోంది. భద్రాచలం పట్టణంలో పోలీస్‌స్టేషన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ రామారావు, సీఐ రమేష్‌కు గన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. మార్చి 19న అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీని రోడ్డుపై అడ్డుకుని పట్టుకున్న రామారావు, ఆ లారీని వదిలేందుకు ముట్టజెప్పిన మాటలు ఇప్పుడు అతనిని గండిలో పడేశాయి. బాధితుడి నుంచి రూ.30 వేలు లంచం డిమాండ్ చేసిన రామారావు, మాట్లాడుకున్న అనంతరం రూ.20 వేలు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నాడు. చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసులు లంచం కోసం ఈ స్థాయిలో దిగజారడం కలవరపెడుతోంది. పైగా ఆ డబ్బును ఏ వ్యక్తిగత ఖాతాలోనూ కాదు, ఓ ప్రైవేట్ వ్యక్తి ఖాతాలో జమ చేయించుకోవడం, ఈ వ్యవహారం పక్కా ప్రణాళికతో సాగిందన్న అనుమానాలకు తావిస్తోంది. రామారావుతో పాటు, ఈ కేసులో సీఐ రమేష్, లావాదేవీలో ఉపయోగించిన ప్రైవేట్ వ్యక్తిని కూడా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అసలే ప్రజలకు రక్షణగా ఉండాల్సిన పోలీసు విభాగంలో... ఇలా అధికార పదవిని వ్యక్తిగత లాభాలకు ఉపయోగించుకోవడం పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా లంచం డబ్బు, అది వెళ్లిన గమ్యం, సీఐ పైన అధికార విచారణలో వచ్చే నిజాలు ఇంకా ఎక్కువ దుమారాన్ని రేపే అవకాశం ఉంది. ఏసీబీ అధికారులు విచారణను ముమ్మరం చేయగా... ఇంకెవరెవరెందులో ఉండొచ్చన్న అనుమానాలు తీవ్రంగా ఊపిరి పీల్చుతున్నాయి. ఇంకా గమనించదగ్గ విషయమేమిటంటే... ఈ కేసులో డబ్బులు ఎవరి కోసం వసూలు చేశారన్నదే కాకుండా, పోలీసులు-ప్రైవేటు వ్యక్తుల మధ్య లావాదేవీలు ఎంత వరకు వెళ్తున్నాయన్నదాన్ని ఇది బహిర్గతం చేసింది.

## కమ్మగూడ భూమిపై 164 సెక్షన్ అమలు

- అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన రెవిన్యూ అధికారులు
- రెండు రోజుల క్రితం లా అండ్ ఆర్డర్ ఇష్యు రావడంతో చర్యలు



**అబ్దుల్లాపూర్ మెట్,మహా:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం కమ్మగూడ రెవిన్యూ పరిధిలోని 240,241,242 సర్వే నంబర్ లో జరిగిన భూ వివాదంతో రెవిన్యూ అధికారులు అలర్ట్ అయ్యారు. అక్కడ లా అండ్ ఆర్డర్ సమస్య వస్తుండడంతో బీఎన్ఎస్ఎస్ 164ను అమలు చేస్తూ ఆర్డర్ రిలీజ్ చేశారు.ఈ సందర్భంగా వివాదంలో ఉన్న సైట్ లో అబ్దుల్లాపూర్ మెట్ ఎంఆర్ఓ సుదర్శన్ రెడ్డి వివరాలు తెలిపారు. కమ్మగుడ రెవిన్యూ పరిధిలోని 240,241,242 సర్వే నంబర్ లో 10.9గుంటల భూమి విషయంలో ఇరు వర్గాల మధ్య గత కొద్ది రోజులుగా వివాదం కొనసాగుతుంది.10.9గుంటల భూమి గుండ రాజమ్మ అనే మహిళకు అనుకూలంగా కోర్టు తీర్పు రావడంతో ఆమె నుండి జీపీఏ తీసుకున్న వారు కొంతమందిలో ఆ భూమి మీదకు వచ్చి హద్దులు చేరుపుతుండగా అప్పటికే ప్లాట్లుగా మారి అక్కడ ఇండ్లు కట్టుకొని నివాసం ఉంటున్న వారంతా ఒక్కసారిగా ఆందోళనకు గురై వచ్చినవారిని అడ్డుకోగా ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది.ఘర్షణ సందర్భంగా ఓ బైక్ కు నిప్పు పెట్టడం,అక్కడ ఉన్న ఓ ప్రైవేట్ బస్సు అద్దాలు తగలబెట్టడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో శాంతియుత వాతావరణాన్ని ఉద్రిక్త ,ప్రమాదకర పరిస్థితికి మారకుండా ముందస్తు చర్యలలో భాగంగా ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత రెడ్డి బీఎన్ఎస్ఎస్ 164 సెక్షన్ అమలుపరిచినట్లు తెలిపారు. దీంతో శాంతిభద్రతలను కాపాడేందుకు అవసరమైన చర్యల కోసం ఆర్డీఓ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సెక్షన్ అమలుతో అక్కడ ఇండ్లు కట్టుకొని నివాసం ఉంటున్న వారు తప్ప ఆ ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాలు ఎలాంటి పనులు చేయవద్దని సూచించారు. ఎలాంటి సమావేశాలు నిర్వహించవద్దని అలా చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ సెక్షన్ ఇరు వర్గాల వారికి వర్తిస్తుందని ఈ భూమి విషయంలో కోర్టు నుండి తదుపరి తీర్పు వచ్చేంతవరకు ఎవ్వరు కూడా ఈ ల్యాండ్ మీదకు రావొద్దు అని సూచించారు.ఈ సమావేశంలో అబ్దుల్లాపూర్ మెట్ ఎంఆర్ఓ సుదర్శన్ రెడ్డి, వనస్థలిపురం సీఐ శ్రీనివాస్ రావు,ఇతర పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## జై బాపు, జై భీమ్ జై సంవిధాన్ ప్రతిజ్ఞ



**వెంకటాపురం, మహా:** భారతదేశపు స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీ చూపిన అహింసా మార్గం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాణంలో చేసిన విశేష కృషి మరియు మన రాజ్యాంగం అందించిన సమానత్వం న్యాయం వంటి విలువలను గౌరవించేందుకు భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ జై బాపు జై భీమ్ జై సంవిధాన్ అనే కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రారంభించిందని మండల కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ హుస్సేన్ పేర్కొన్నారు. గురువారం ములుగు జిల్లా నూగూరు వెంకటాపురం మండల కేంద్రం నేలారిపేట దళిత వీధిలో జై బాపు, జై భీమ్ జై సంవిధాన్ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. మన రాజ్యాంగాన్ని మన విలువలను రక్షించేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరముందని ఈ సందర్భంగా తెలియజేసి సంబంధిత సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నూగూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చిడెం సాంబశివరావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు సాధన పెల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ గారపాటి రవి, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి శ్రీరాములు రమేష్, పిల్లారిశెట్టి మురళి నాయుడు, పలువురు కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పేదవాడి కడుపు నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి
- ఆరుట్లలో సన్నబియ్యం లబ్దిదారులతో సహపంక్తి భోజనాలు



**రంగారెడ్డి జిల్లా, మహా:** ప్రతి పేదవాడి కడుపు నింపడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడం చారిత్రక నిర్ణయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం మంచాల మండలం, ఆరుట్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్ష కార్యదర్శులు రావుల భాషయ్య, దాస రమోని రమేష్ ల ఆధ్వర్యంలో సన్నబియ్యం లబ్ధిదారులతో కలిసి సహపంక్తి భోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవాడు కడుపు నిండా తిన్న రోజునే వారికి అసలైన పండగ రోజు అని ప్రజలందరి సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి, నియోజకవర్గం అభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచాల సహకారం సంఘం చైర్మన్ వెదిరే హన్మంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వింజమూరి రాంరెడ్డి, నాయకులు బైరిక రమాకాంత్ రెడ్డి, చీమల జంగయ్య యాదవ్, ఎడమ నరేందర్ రెడ్డి, ఎండి సలాం, జెనిగే వెంకటేష్, మార సురేష్, మాధగోని జంగయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## యాసంగి ధాన్యం కొనుగోళ్లలో తరుగు, కోతలు విధించవద్దు

- కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని ఏర్పాట్లు చేయాలి
- చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం



**కరీంనగర్, మహా:** రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యంలో ఎలాంటి తరుగు, కోతలు విధించవద్దని, ధాన్యం కల్లాల వద్ద రైతులకు అన్ని వసతులు కల్పించాలని చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం అన్నారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ తో కలిసి యాసంగి ధాన్యం కొనుగోళ్లపై పౌరసరఫరాల శాఖ అధికారులతో, రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతులకు ప్రభుత్వం ఎటువంటి లోటూ రానివ్వడం లేదని అన్నారు. రెండు లక్షల రూపాయల రుణమాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్ వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యంగా చొప్పదండి నియోజకవర్గంలో ఒక్క గుంట భూమి కూడా ఎండిపోకుండా చివరి ఆయకట్టు వరకు సాగు నీళ్లు ఇస్తున్నామని తెలిపారు. గత కొనుగోళ్లలో రైతుకు 48 గంటల్లోగా ధాన్యం విక్రయ సొమ్ము చెల్లించిన విషయాన్ని గుర్తు చేశారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులూ రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతుకు కావలసిన అన్ని వసతులు, సౌకర్యాలను కల్పించాలని సూచించారు. తేమ, తాలు పేరిట ధాన్యంలో కోతలు, కటింగ్ వంటివి చేయరాదని అన్నారు. రైతులు ఎక్కువ కాలం కల్లాల వద్ద నిరీక్షించకుండా చూడాలని అన్నారు. ధాన్యం రవాణా చేసే లారీలు వెంట వెంటనే ధాన్యాన్ని మిల్లరకు తరలించాలని అన్నారు. రైస్ మిల్లర్ల సమస్యలు ఏవైనా ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో గత పంట సీజన్లలో ఎలాంటి కోతలూ లేకుండా ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. అదేవిధంగా ప్రస్తుత యాసంగిలోనూ అదే తరహాలో కొనుగోళ్లు జరపాలని అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో కట్టింగ్ విధించవద్దని మిల్లర్లను ఆదేశించారు. రైతులు శుభ్రమైన, పక్వానికి వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చే విధంగా గతంలోనే హార్వెస్టర్లకు సమావేశం నిర్వహించామని తెలిపారు. షెడ్యూల్ హార్వెస్టింగ్ పై కూడా అవగాహన కల్పించామని అన్నారు. కాబట్టి ఈసారి మిల్లర్లకు ఇబ్బందులు ఉండవని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రజనీకాంత్, జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగరావు పాల్గొన్నారు.

### హనుమాన్ దీక్ష పరులకు
## అన్నప్రసాద వితరణ కార్యక్రమం



**కరీంనగర్, మహా:** కరీంనగర్ పట్టణంలోని కొత్తపల్లి వార్డులో గల మైత్రి గ్రూప్ చైర్మన్ కొత్త జయపాల్ రెడ్డి గెస్ట్ హౌస్ లో కొత్త జయపాల్ రెడ్డి సహకారంతో మాజీ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ డి సంపత్ ఆధ్వర్యంలో ఈనెల 12వ తారీకు చిన్న హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గురువారం నుంచి జయంతి వరకు హనుమాన్ దీక్ష మాలదారులకు, బిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కొత్త జయపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై హనుమాన్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి, స్వాములకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా కొత్త జయపాల్ రెడ్డి మాట్లాడుతూ.. హనుమాన్ దీక్ష మాలదారులకు అన్న ప్రసాద వితరణ చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్టు తెలిపారు. నేటి నుండి చిన్న హనుమాన్ జయంతి వరకు అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందని దీనిని హనుమాన్ మాల దీక్ష పరులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈరోజు సుమారు 300 మంది అంజన్న స్వాములకు అన్నప్రసాదం అందించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా మాజీ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ డి సంపత్ మాట్లాడుతూ.. హనుమాన్ మాల దీక్షపరులకు అన్నదానం చేసేందుకు సంకల్పించి మొదటగా కొత్త జయపాల్ రెడ్డిని సంప్రదించగా వారు వెంటనే అంగీకరించి వారి సహకారం అందించారని.. కొత్త జయపాల్ రెడ్డి గారికి ఆ అంజన్న కృపా కటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్త జయపాల్ రెడ్డి తో పాటు, డి. సంపత్, బ్రహ్మం, నల్ల ఆదిరెడ్డి, శ్రీను, విజయ్, శివ, ఎడవెల్లి కుమార్ తో పాటు జయపాలన్న మిత్రమండలి సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రేషన్ కార్డు దరఖాస్తుల ఆన్లైన్ పనితీరుపై
## కలెక్టర్ రాహుల్ శర్మ ఆగ్రహం
### కాటారం మండల పరిషత్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ



**కాటారం, మహా :** కాటారం మండల పరిషత్ కార్యాలయంలో రేషన్ కార్డు దరఖాస్తుల ఆన్లైన్ అప్ లోడ్ కార్యక్రమం సక్రమంగా లేకపోవడం పట్ల జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఎంపీడీవో పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కాటారం మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలో సరిపోను సిబ్బంది లేరని ఖాళీలతో ఇబ్బందులు ఉన్నాయని ఎంపీడీవో రాజు కలెక్టర్కు వివరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రేషన్ కార్డుల ప్రక్రియ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని అన్నారు. రేషన్ కార్డు కోసం ప్రజలు చేసుకున్న దరఖాస్తులను ఏ రిజిస్టర్ లో ఎంట్రీ చేశారని ఆరా తీశారు. రిజిస్టర్ లో దరఖాస్తుల పూర్తి వివరాలు నమోదు చేయకపోవడం కలెక్టర్ గుర్తించారు. దరఖాస్తులు వచ్చిన సంకేక అనుగుణంగా ఆన్లైన్ కాకపోవడం ఇన్ని రోజుల నుండి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఎక్కడ పెట్టారని అడిగారు. సాయంత్రం లోగా దరఖాస్తులు అన్నింటిని ఆన్లైన్ చేసి హార్డు కాపీ పంపించాలని ఎంపీడీవో బాబును కలెక్టర్ ఆదేశించారు. సిబ్బంది ఖాళీలపై ప్రశ్నించారు. జూనియర్ అసిస్టెంట్ గత 20 రోజులుగా రాలేదని సూపరింటెండెంట్ మహాదేవపూర్ ఆఫీస్కు డిప్యూటీషన్లో పనిచేస్తున్నారని చెప్పగా డిప్యూటేషన్ రద్దు చేయాలని కలెక్టర్ అన్నారు.

**సన్న బియ్యం పంపిణీ పరిశీలించిన కలెక్టర్**

సన్న బియ్యం ఎలా ఉన్నాయి? బాగున్నాయా? సక్రమంగా పంపిణీ చేస్తున్నారా.. మీరు తీసుకున్నారా.. తీసుకున్న బియ్యం వండుకుని తింటారా? ఏం ఏం చేస్తారని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆహార భద్రతా కార్డు దారులను అడిగారు. గురువారం రోజున జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని కొత్తపెల్లి గ్రామంలో చౌక ధరల దుకాణం ను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సన్న బియ్యం పంపిణీ పరిశీలించారు. రేషన్ కార్డు ద్వారా బియ్యం తీసుకున్న లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడారు బియ్యం బాగున్నాయి వండుకొని తినండి ప్రభుత్వం పేద ప్రజల కోసం సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. తెల్లరేషన్ కార్డు దారులకు ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న సన్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 11 మండలాల్లో సన్న బియ్యం 77 శాతం పంపిణీ పూర్తయినట్లు, జిల్లాలో 1,23,508 రేషన్ కార్డు లుండగా 2276.522 మెట్రిక్ టన్నుల బియ్యం అలాట్మెంట్ కు 1757.209 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా బయో మెట్రిక్ ద్వారా బియ్యం సరఫరా వివరాలు నమోదు పరికరాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశోక్ కుమార్, డిఎస్ఓ శ్రీనాథ్, కాటారం డిప్యూటీ తహసిల్దార్ రామ్మోహన్, ఎంపీడీవో బాబు డీలర్ భారీ పాషా పాల్గొన్నారు.

### ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు
## సిసి రోడ్డు నిర్మించాలి

**తొర్రూర్ , మహా:** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లే దారిలో సిసి రోడ్ల నిర్మాణాన్ని చేపట్టాలని ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా నాయకులు ఎండి అమీర్ తొర్రూర్ మండల అధ్యక్షుడు కళ్యాణి ఆకాష్ డిమాండ్ చేశారు ఎస్ఎఫ్ఐ తొర్రూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్ కు వినతిపత్రం అందజేశారు అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లే విద్యార్థులు సిసి రోడ్ల లేకపోవడం కళాశాలలో చెత్త పేరుకుపోయి చెట్లు పెరిగి బుర్దమయంగా ఉండడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లే దారిలో సిసి రోడ్ల నిర్మాణాన్ని చేపట్టాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వారితో పాటుఎస్ఎఫ్ఐ తొర్రూర్ మండల ఉపాధ్యక్షుడు మహేష్ మండల నాయకులు ప్రవీణ్ యాకన్న వినోద్ పాల్గొన్నారు

### వర్ష సూచన ఉన్నప్పటికీ
## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించరా ?
### బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి



**కరీంనగర్, మహా:** తెలంగాణలో భారీ వర్షాలు ఉన్నాయని ఒకవైపు వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నప్పటికీ కరీంనగర్ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం, కొనుగోలు కేంద్రాలకు చేరుకున్న ధాన్యాన్ని తడవకుండా తాడిపత్రిలు సమకూర్చకపోవడం రైతాంగం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి తార్కాణమని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బిజెపి కిసాన్ మోర్చా కరీంనగర్ జిల్లా అధ్యక్షులు అన్నాడి రాజిరెడ్డి తో కలిసి ఆయన కరీంనగర్ జిల్లా కలెక్టర్ కు తక్షణం కొనుగోలు కేంద్రాలు యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని, హమాలీలు, గోనే సంచులు, సుతిలి మరియు రవాణా ఏర్పాటు చేసేలా అధికార యంత్రాంగాన్ని ఆదేశించాలని , ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్లు ఏర్పాటు చేయాలని ఈమెయిల్ ద్వారా విజ్ఞప్తి చేశారు. ప్రతి సంవత్సరం పంట కోతల సీజన్లో అకాల వర్షాలు కురుస్తూ కొనుగోలు కేంద్రాల్లో దాన్యం మొక్కజొన్నలు తడుస్తున్నప్పటికీ ప్రభుత్వ యంత్రాంగానికి చీమకుట్టినట్టైనా లేదని ఏ రోజు కూడా ముందు జాగ్రత్తలు తీసుకున్న పాపాన పోలేదని అధికార పార్టీ మంత్రులు గానీ, శాసనసభ్యులుగాని జిల్లా అధికార యంత్రాంగం ను హెచ్చరించకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో దాన్యం తడిస్తే రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన హెచ్చరించారు.

## నిరుపేద కుటుంబంతో సహపంక్తి భోజనం ఎమ్మెల్యే కసిరెడ్డి



**రంగారెడ్డి జిల్లా, మహా:** నిరుపేద కుటుంబంలో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహపంక్తి భోజనం చేశారు. కడ్తాల్ మండలం, కొండ్రీగానీ బొడ్ తండా గ్రామ పంచాయతిలో, కల్వకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పర్యటించారు. ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి, అక్కడే కొండ్రీగానీ బొడ్ తండాకు చెందిన సబావత్ టాక్రూ అనే రైతు ఇంట్లో సహపంక్తి భోజనం చేయడం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం, పేదల కడుపు నిండా తినాలన్నదే ప్రభుత్వ నిర్ణయంగా సన్న బియ్యం పంపిణీ చేస్తుంది. గత ప్రభుత్వం పది సంవత్సరాలు పరిపాలించి డబుల్ బెడ్ రూమ్ ఇస్తామని, అదే విదంగా సన్న బియ్యం ఇస్తామని చెప్పి తెలంగాణ ప్రజలను మోసం చేయడం జరిగింది. కెసిఆర్ కుటుంబం అబద్ధాలు చెప్పి గద్దెనెక్కి ఎన్నికలలో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి కూడా అమలు చేయకుండా తెలంగాణ ప్రజలను వంచించారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను ఒక్కొకటిగా అమలు చేస్తుంటే చూసి జీర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి మెంబర్ ఆయిల శ్రీనివాస్ గౌడ్, ఏఎంసీ చైర్మన్ యట్టా గీత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యట్టా నరసింహ, కడ్తాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు బిచ్య నాయక్, షాబుద్దీన్ పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ విద్యార్థులకు రాష్ట్ర స్థాయి పతకాలు



**కరీంనగర్, మహా:** రీజనింగ్.. ఆప్టిట్యూడ్ వలన విద్యార్థులకు కీలకమైన అంశాలని వారికి విజయాలను అందించడంలో విశేష పాత్ర పోషిస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.. స్థానిక కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇ టెక్నో పాఠశాలలో విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఇంటర్నేషనల్ రీజనింగ్.. ఆప్టిట్యూడ్ ఒలంపియాడ్లో బంగారు పతకాలు సాధించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ రకాల పోటీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని.. వారి మేధస్సుకు కొలమానంగా రీజనింగ్ ఆప్టిట్యూడ్ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని ఈ అంశాలలో విద్యార్థులకు లాభాలు చేకూరుతాయని.. విద్యార్థులకు సృజనాత్మకత.. కొత్త ఆలోచనలు పెంపొందిస్తూ నిర్ణయాత్మక శక్తిని పోషిస్తుందని.. వారు అవలంభిస్తున్న విద్యా విధానానికి గొప్ప ప్రతీకా అని అభివర్ణించారు. విద్యార్థులకు సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలో సమాజంలో ఎదురవుతున్న విషయాలను తెలుసుకోవడానికి దోహద పడుతుందని చెప్పారు. ఈ విషయానికి ఉన్న విశిష్టతను దృష్టిలో పెట్టుకొని పలు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంటూ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో విద్యను అందిస్తున్నామని చెప్పారు.ఇటీవల ప్రముఖ పోటి పరీక్షల సంస్థ సిల్వర్ జోన్ ఫౌండేషన్ నిర్వహించిన పరీక్షకు అనూహ్య స్పందన వచ్చిందని ఈ స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులను పోటీ పరీక్షల సంస్థ సిల్వర్ జోన్ ఫౌండేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి అంతర్జాతీయ పోటీలలో పాఠశాలకు చెందిన ఏడవ తరగతి యల్. రామన్ బంగారు పతకం, ఎనిమిదవ తరగతి యం. శివేన్ రెడ్డి రజత పతకం, యస్.పి. క్రిష్ణ చైతన్య బంగారు పతకం, తొమ్మిదవ తరగతి జి. సాయి సంహిత్ బంగారు పతకం, పి. శ్లోక రజత పతకం, పదవ తరగతి విద్యార్థులు యం. హిమేష్ చంద్ర, బంగారు, డి. ఉదయ శ్రీ రజత పతకాలు సాధించారని హర్షం వ్యక్తం చేశారు. విజేతలకు పుష్పగుచ్చాలు అందజేసి ఘన విజయాలను సాధించి పాఠశాలకు వన్నె తెవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా జిల్లా ఐజెయు యూనియన్ సంబురాలు




**వరంగల్, మహా:** వరంగల్ జిల్లా ఐ జె యు నూతన కమిటీ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నిక కాగా గురువారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు ఐ జె యు వరంగల్ జిల్లా అధ్యక్షులు శ్రీ రాం రాంచందర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున టపాసులు ( బాంబులు) పేలుస్తూ సంబురాలు చేసుకున్నారు. అనంతరం పలువురు జర్నలిస్ట్ లు నూతన కమిటీ కి అభినందనలు తెలియజేస్తూ, నూతన కమిటీ వారు జర్నలిస్ట్ ల సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గా ప్రసాద్, ఉపాధ్యక్షులు కుర్న వెంకటేశ్వర్లు, జన్ను స్వామి, జాయింట్ సెక్రటరీ బొమ్మగాని అశోక్, చింతనూరి రాజు, కార్యవర్గ సభ్యులు బాబర్, హుస్సేన్ పాషా, అక్రం సీనియర్ నాయకులు సంగోజు రవి, పిన్నా శివకుమార్, బుదారపు శ్రీను, బొడ్ల రవీందర్ నాథ్, విజయ్ రాజ్, నయింపాషా, పెరుమాండ్ల మధుసూదన్, కందుల శ్రీధర్, దివ్వెల పూర్ణ చందర్, పారిజాతం సంతోష్ రాజేందర్, ఇస్మాయిల్, సాజిద్ పాషా, ఓంప్రకాష్, కూచన సంతోష్, గణేష్, బషీర్, జన్ను శ్యామ్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## వడగండ్ల వానకు నేలకొరిగిన వరి పొలాలు



**తొర్రూర్, మహా :** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం హరిపిరాల గ్రామంలో కూన వెంకన్న అనే రైతు తాను 10 ఎకరాల వరి నాటు వేయగా వడగండ్ల వానకు తాను నష్టపోయానని తన గోడు వెళ్ళబోసుకోగా స్పందించిన మాజీ మంత్రివర్యులు పంట పొలాలను పరిశీలించి ఈ మోసపూరిత ప్రభుత్వాన్ని నమ్మి ఇప్పటికే ప్రజలు మోసపోయారని రైతులను ఆగం చేసి వాళ్ళకి కనీసం సాగునీరు ఇయ్యకుండా ఇప్పటికే రైతులు నష్టపోయారు రైతులకు ఎలాగైతే రూ, 25 వేల నష్టపరిహారం చెల్లించాలని మేము డిమాండ్ చేసామో అలాగే వడగండ్ల వాన కూడా నష్టపోయిన పంట పొలాలకు ఒక ఎకరానికి రూ 25 వేల నష్టపరిహారం చెల్లించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వం మీద ఉంది అని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. రైతు సంక్షేమం కోసం కెసిఆర్ రైతు బంధు, సాగునీరు, పంట నష్టం ఇచ్చి ఆదుకుంటే ఈ ప్రభుత్వం కనీసం రైతులను పట్టించుకునే పరిస్థితి లేదు ఇప్పటికైనా ఈ ప్రభుత్వం కళ్ళు తెరిచి రైతులను ఆదుకోవాలి అని వారు అన్నారు.

### మాదకద్రవ్యాల నియంత్రణ
## అందరి బాధ్యత




**తొర్రూర్, మహా:** మాదకద్రవ్యాల నియంత్రణ మనందరి బాధ్యత అని తొర్రూర్ సి ఐ గణేష్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా తిరువూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాలు మానవ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన సదస్సుకు నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిని మానసికంగా, శారీరకంగా నాశనం చేస్తుందని ఇది ఒక వ్యక్తి జీవితాన్ని మాత్రమే కాకుండా, కుటుంబాన్ని, సమాజాన్ని కూడా ప్రభావితం చేస్తుందన్నారు. యువత, ముఖ్యంగా విద్యార్థులు, దీని పట్ల అప్రమత్తంగా ఉండాలని.. కుటుంబ సభ్యులు పిల్లలపై నిరంతరం దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం ఎస్సై ఉపేందర్ మాట్లాడుతూ.. ఇటీవల మాదకద్రవ్యాల అమ్మకాలు, వినియోగం గ్రామీణ ప్రాంతాల్లో కూడా పెరుగుతోందని.. యువత ఎటువంటి పరిస్థితుల్లో మాదకద్రవ్యాలపై దృష్టి పెట్టకుండా భవిష్యత్తు గురించి ఆలోచించాలన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణకు కేవలం పోలీసు శాఖ మాత్రమే కాకుండా ప్రతి పౌరుడు కూడా బాధ్యత వహించాలన్నారు. స్కూళ్లు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, విద్యార్థుల్లో జ్ఞానం, జాగ్రత్త పెంచాలన్నారు.

## విద్యుత్ ఉద్యోగుల భద్రత ముఖ్యం
### ఎస్ఈ మల్చూర్ నాయక్



**ములుగు, మహా :** క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగుల భద్రతను మెరుగు పరచడానికి టీజీఎన్పీడీసీఎల్ చర్యలు తీసుకుంటోందని, అందులో భాగంగా ఉద్యోగులు, సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నామని భూపాలపల్లి ఎస్ఈ (ఆపరేషన్) మల్చూర్ నాయక్ అన్నారు. గురువారం ములుగులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ములుగు, మల్లంపల్లి, వెంకటాపూర్, గోవిందరావుపేట, తాడ్వాయి విద్యుత్ ఉద్యోగులకు ఎల్సీ (లైన్ క్లియర్) అప్లికేషన్ పై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. ఉద్యోగులు విధుల్లో జాగ్రత్తగా ఉండాలని, పోల్ లేదా లైన్ పై ఉన్నప్పుడు పనిచేసే విధానంపై తర్ఫీదు పొందాలన్నారు. ఎప్పటికప్పుడు ఫొటోలు తీసుకోవాలని, సబ్ స్టేషన్ ఆపరేటర్లు ఎల్సీ ఇచ్చేముందు సంబంధిత ఏఈతో కన్ఫర్మేషన్ తీసుకొని సమన్వయం చేసుకోవాలని సూచించారు. అందుకు గాను ప్రత్యేక యాప్ ను రూపొందించామని తెలిపారు. విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టామని, అతి త్వరలోనే ఆన్లైన్ లో నమోదు చేసిన తరువాత పనిచేసేవిధంగా యాప్ ప్రారంభం కాబోతోందన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది తీసుకోవాల్సిన భద్రతపై ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డీఈ మల్లేషం, ఆపరేషనల్ డీఈ పులుసం నాగేశ్వర్ రావు, ఏడీఈ వేణుగోపాల్, ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## ములుగు ఎంఈవోగా వజ్జ తిరుపతి



**ములుగు, మహా :** ములుగు మండల విద్యాశాఖాధికారిగా వజ్జ తిరుపతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. మల్లంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్న పీజీహెచ్ఎం తిరుపతి విద్యార్థుల సేవకు అంకితభావంతో పనిచేస్తున్నారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఏ.మధుసూదన్, జనగాం బాబురావు, పద్మాకర్ రెడ్డి, మంకిడి రవి, కంచు ప్రభాకర్, సీఆర్పీ పొద్య కుమార్, రికార్డు అసిస్టెంట్ దిలీప్, చిరంజీవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


### ఇంగ్లీష్ పట్ల భయాన్ని పోగొట్టి
## ఆత్మస్థైర్యాన్ని పెంచాలి
### జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్





**ములుగు, మహా :** ఇంగ్లీష్ పట్ల విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి ఆత్మస్థైర్యాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సూచించారు. గురువారం కలెక్టరేట్ లో జిల్లాలోని 54ప్రాథమిక పాఠశాలల్లో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఆదేశాల మేరకు దిశ ఫౌండేషన్, ఈఎల్ఎఫ్ ఇంగ్లీష్ సహకారంతో చేపట్టిన 80 రోజుల లెర్న్ టు రీడ్ (ఇంగ్లీష్ బోధన కార్యక్రమం) ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. పాఠశాల విద్యార్థుల్లో ఇంగ్లీష్ బోధనపై మక్కు పెంచాలని, దాని ద్వారా భవిష్యత్తులో ఎలాంటి పోటీ పరీక్షలనైనా ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. వివిధ మండలాల నుండి వచ్చిన 1 నుండి 5 వ తరగతి చదివే విద్యార్థులు ఇంగ్లీష్ లో వారి సెల్ఫ్ ఇంట్రడక్షన్, రోల్ ప్లే, సంభాషణ తదితర అంశాలను ప్రదర్శించగా కలెక్టర్ అభినందించారు. ఉత్తమ ప్రతిభ కనపరిచిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు కలెక్టర్ మెమెంటో, సర్టిఫికెట్ లను అందచేశారు.

## పేదల కడుపు నింపేందుకే..
## సన్న బియ్యం పథకం

- పేదల మనసులో స్థానం సంపాదించిన రాష్ట్ర ప్రభుత్వం
- సన్నాల సాగుకు అత్యధిక ప్రోత్సాహం
- పేదలంతా వినియోగించుకోవాలి





**కరీంనగర్, మహా:** దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్న బియ్యం పథకం అమలు చేయడం విప్లవాత్మకమని మానకొండూర్ శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శంకరపట్నం మండలం వంకాయగూడెం గ్రామంలో గురువారం సన్న బియ్యం లబ్ధిదారుడు చలిగంటి గణేష్ ఇంట్లో సన్న బియ్యంతో వండిన అన్నంతో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్ సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ సన్న బియ్యం పంపిణీతో 80 శాతానికి పైగా బడుగు బలహీన వర్గాల ప్రజలు ప్రయోజనం పొందుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సన్న బియ్యం పథకం పేదవాడి ఆత్మగౌరవ పథకమని తెలిపారు. దేశ చరిత్రలోనే సన్న బియ్యం పంపిణీ చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఏ రాష్ట్రంలోనూ సన్న బియ్యం పంపిణీ చేయడం లేదని, ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే ప్రభుత్వం సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నదని, ప్రజలంతా ఈ సన్నబియాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. రాబోయే రోజుల్లో ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు అందించి తీరుతామని, పేద ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నదని తెలిపారు. ముఖ్యమంత్రి వినూత్నంగా ఆలోచన చేసి సన్నబియ్యం పథకాన్ని అమలు చేయడంతో పేద ప్రజల మనసును దోచుకున్నారని పేర్కొన్నారు.



# టారిఫ్‌లపై ఊరట

## పుంజుకున్న ఆసియా మార్కెట్లు

చైనా మినహా మిగతా దేశాలపై విధించిన అధిక సుంకాలను 90 రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు 'డొనాల్డ్ ట్రంప్' ప్రకటించిన తర్వాత.. ఆసియా మార్కెట్లు లాభాలబాట పట్టాయి. జపాన్ నిక్కీ 8.35% పెరిగింది. దక్షిణ కొరియా కోస్పి ఇండెక్స్ 5.38 శాతం పెరగగా, స్మాల్ క్యాప్ కోస్డాక్ 5.09 శాతం లాభపడింది. చైనా.. అమెరికన్ వస్తువులపై 84 శాతం సుంకాలను ప్రకటించిన తరువాత.. అమెరికా సుంకాలను 104 శాతం నుంచి 125 శాతానికి పెంచడంతో.. పెట్టుబడిదారులు చైనా స్టాక్‌లపై ఇన్వెస్ట్ చేయడానికి ఆలోచిస్తున్నారు. గురువారం (10న) శ్రీ మహావీర్ జయంతి సందర్భంగా భారతదేశంలో మార్కెట్లు సెలవు.

## ప్రతీకార సుంకాల వార్

**మొత్తం 75 దేశాలపై విధించిన సుంకాలను 90 రోజుల పాటు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు అమెరికా వైట్‌హౌస్ అధికారికంగా ప్రకటించిన తరువాత.. అమెరికా- చైనాల మధ్య ప్రతీకార సుంకాల వార్ కొనసాగుతోంది. ట్రంప్ మొదలు పెట్టిన సుంకాల యుద్ధాన్ని చైనా కూడా అదే స్థాయిలో తిప్పికొడుతోంది. ఇందులో భాగంగా బుధవారం అమెరికా వస్తువులపై ప్రస్తుతం ఉన్న 34 శాతం టారిఫ్‌ను 84శాతానికి పెంచుతూ చైనా నిర్ణయం తీసుకుంది.**

# 470 ఎకరాల అడవిని నిర్మించిన నాయర్: ఆనంద్ మహీంద్రా ట్వీట్

తన ఎక్స్ ఖాతాలో ఎప్పటికప్పుడు ఆసక్తికరమైన విషయాలను షేర్ చేసే.. దేశీయ వ్యాపార దిగ్గజం ఆనంద్ మహీంద్రా తాజాగా ఓ వీడియో షేర్ చేశారు. మియావాకి అడవి అంటే ఏమిటో నాకు తెలుసు, కానీ డాక్టర్ నాయర్ గురించి తెలియదు అని పోస్ట్ చేశారు. ఆనంద్ మహీంద్రా షేర్ చేసిన వీడియోలో ఒక అడవిని చూడవచ్చు. భారతదేశంలో ప్రపంచంలోనే అతిపెద్ద మియావాకి అడవిని డాక్టర్ నాయర్ ఎలా సృష్టించారో నాకు తెలియదు. సుస్థిరతకు ప్రాధాన్యం లేని ఈ రోజుల్లో.. మన మధ్య ఇలాంటి హీరోలు ఉండటం గర్వకారణం అని ఆయన ట్వీట్ చేశారు.

**నాయర్ నిర్మించిన అడవి**

గుజరాత్‌లోని కచ్‌లో నాయర్ సుమారు 470 ఎకరాల విస్తీర్ణంలో అడవిని నిర్మించారు. ఇందులో 3,00,000 కంటే ఎక్కువ చెట్లు ఉన్నాయి. ఈ అడవిని జపనీస్ వృక్షశాస్త్రజ్ఞుడు అకిరా మియావాకి టెక్నాలజీ సాయంతో అభివృద్ధి చేశారు. ఈ పద్ధతిలో సహజ పర్యావరణ వ్యవస్థలను అనుకరించడానికి వివిధ రకాల స్థానిక వృక్ష జాతులను దగ్గరగా నాటడం జరుగుతుంది. దీని ఫలితంగా ఇవి సాధారణ మొక్కలకంటే 10 రెట్లు వేగంగా పెరుగుతాయి.

**ఎవరీ డాక్టర్ నాయర్**

డాక్టర్ నాయర్ పర్యావరణవేత్త & ఎన్విరో క్రియేటర్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు. 2014లో ఈయన 1500 చెట్లతో.. మియావాకి అడవిని ప్రారంభించడం మొదలుపెట్టారు. ఇలాంటి అడవులను ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 100 కంటే ఎక్కువ నిర్మించారు. వీటిలో చెప్పుకోదగ్గది కచ్‌లోని స్మృతివన్ మియావాకి అడవి. దీనిని 2001 గుజరాత్ భూకంప బాధితులకు నివాళిగా నిర్మించారు. కాగా 2030 నాటికి 100 కోట్ల చెట్లను నాటడమే లక్ష్యంగా డాక్టర్ నాయర్ ముందుకు సాగుతున్నారు.



**మియావాకి పద్ధతి**

1970లో జపనీస్ వృక్షశాస్త్రజ్ఞుడు అకిరా మియావాకి ఈ టెక్నాలజీని ప్రవేశపెట్టారు. ఈ పద్ధతిలో మొక్కలను దగ్గరదగ్గరగా నాటుతారు. కాబట్టి ఇవి సాధారణ చెట్ల కంటే 10 రేట్లు వేగంగా పెరుగుతాయి. ఈ పద్ధతిలో మొక్కలను పెంచడం వల్ల మట్టి కూడా ఆరోగ్యంగా ఉంటుందని తెలుస్తోంది.



## రూ. 1,000 కోట్ల ల్యాప్‌టాప్ ప్లాంటు..


# 5,000 ఉద్యోగాలు

**చెన్నై:** ఎలక్ట్రానిక్స్ తయారీ సేవల దిగ్గజం డిక్సన్ టెక్నాలజీస్, చెన్నైకి దగ్గర్లోని ఒరగాడంలో రూ. 1,000 కోట్లతో ప్లాంటును ఏర్పాటు చేయనుంది. దీనితో ప్రాంతీయంగా 5,000 పైచిలుకు ఉద్యోగాల కల్పన జరుగుతుందని అంచనా. ప్లాంటు నెలకొల్పడానికి సంబంధించి తమిళనాడు ప్రభుత్వంతో కంపెనీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్లాంటులో ఇతర కంపెనీల కోసం ల్యాప్‌టాప్‌లు, ఆల్ ఇన్ వన్ పర్సనల్ కంప్యూటర్లు మొదలైన వాటిని ఉత్పత్తి చేయనుంది. ఇందులో త్వరలోనే హెచ్‌పీ ల్యాప్‌టాప్‌ల తయారీ ప్రారంభమవుతుందని తమిళనాడు పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా తెలిపారు. తమిళనాడు ప్రభుత్వం 100 బిలియన్ డాలర్ల ఎలక్ట్రానిక్స్ తయారీ వ్యవస్థను నిర్మించడంపై దృష్టి పెట్టిన నేపథ్యంలో ఇది ప్రాధాన్యం సంతరించుకుంది. డిక్సన్ టెక్నాలజీస్ 1993లో ఏర్పాటైంది. శాంసంగ్, షావోమీ, మోటరోలా, బోట్, వన్‌ప్లస్ తదితర సంస్థల కోసం కాంట్రాక్ట్ తయారీ సేవలను అందిస్తోంది.

## అమెరికాకు 600 టన్నుల ఐఫోన్లు..


# అదీ చార్టెడ్ ఫ్లైట్‌లలో..!


విదేశీ దిగుమతులపై ప్రతీకార సుంకాల ప్రకటనతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాల్లో వాణిజ్య ప్రకంపనలు సృష్టించారు. ముఖ్యంగా చైనా నుంచి దిగుమతయ్యే వస్తువులపై భారీ సుంకాలు విధించడంతో అక్కడ తయారీ నిర్వహిస్తున్న కంపెనీలు ఇరుకున పడ్డాయి. ఈ క్రమంలో ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్ ట్రంప్ టారిఫ్‌ల నుంచి బయటపడేందుకు ఉపాయం ఆలోచించింది. భారత్ నుంచి 600 టన్నులు లేదా సుమారు 15 లక్షల ఐఫోన్లను ప్రత్యేక కార్గో విమానాల్లో అమెరికాకు తరలించినట్లు వార్తా సంస్థ రాయిటర్స్ పేర్కొంది. అమెరికాచైనాల మధ్య టారిఫ్ వార్ నడుస్తున్న నేపథ్యంలో యాపిల్‌కు అతిపెద్ద మార్కెట్లలో ఒకటైన అమెరికాలో పాపులర్ ఐఫోన్ల తగినంత స్టాక్‌ను అందుబాటులో ఉంచేందుకు కంపెనీ ఈ రహస్య వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తమ ఉత్పత్తులకు ప్రధాన తయారీ కేంద్రమైన చైనా నుంచి దిగుమతులపైనే యాపిల్ అధికంగా ఆధారపడుతున్న నేపథ్యంలో అమెరికాలో ఐఫోన్ల ధరలు భారీగా పెరగవచ్చని విశ్లేషకులు హెచ్చరించారు. చైనాపై విధించే టారిఫ్ రేటు ప్రస్తుతం 125 శాతంగా ఉంది. ఇక భారత్ నుండి వచ్చే దిగుమతులపై ఈ సుంకం 26 శాతం. అయితే చైనా మినహా ఇతర అన్ని దేశాలపై ఈ సుంకాల అమలును 90 రోజులు వాయిదా వేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. భారత్‌లోని దక్షిణాది రాష్ట్రమైన తమిళనాడులోని చెన్నై విమానాశ్రయంలో కస్టమ్స్ క్లియర్ చేయడానికి అవసరమైన సమయాన్ని 30 గంటల నుండి ఆరు గంటలకు తగ్గించేలా విమానాశ్రయ అధికారులతో కంపెనీ లాబీయింగ్ చేసినట్లుగా తెలుస్తోంది. "గ్రీన్ కారిడార్" పేరుతో చైనాలోని కొన్ని విమానాశ్రయాలలో చేస్తున్న ప్రత్యేక ఏర్పాటునే చెన్నై ఎయిర్‌పోర్ట్‌లోనూ యాపిల్ చేయించినట్లు తమకు లభించిన సమాచారాన్ని ఉటంకిస్తూ రాయిటర్స్ రిపోర్ట్ చేసింది.





# ఢిల్లీకి చేరిన.. 26 /11 ముంబై దాడుల సూత్రధారి





**మహా:** దేశంలో సంచలనం రేపిన 26 /11 ముంబై దాడులు సూత్రధారి తహవూర్ రాణాను ఎన్ఐఏ అధికారులు ప్రత్యేక విమానంలో అమెరికా నుంచి ఇండియాకు తీసుకొచ్చారు. ఢిల్లీ పాలమ్ ఎయిర్‌పోర్ట్‌లో తహవూర్ రాణాతో వచ్చిన ప్రత్యేక విమానం ల్యాండింగ్ అయ్యింది. అక్కడే తహవూర్ రాణాను అరెస్టు చేసిన అధికారులు ఎన్ఐఏ ఆఫీస్ కు తరలించారు. అక్కడ ఎన్ఐఏ న్యాయమూర్తి 2008ఉగ్రదాడి కేసులో రాణాను విచారించనున్నారు. ఈ సందర్భంగా ఎన్ఐఏ ఆఫీస్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దేశ రాజధాని రీజియన్ లో హై అలర్ట్ ప్రకటించారు. విచారణ అనంతరం రాణాను పటిష్టమైన భద్రత మధ్య తీహార్ జైలుకు తరలించనున్నట్లుగా సమాచారం. పాకిస్తాన్ సంతతికి చెందిన కెనడా పౌరుడైన తహవూర్ రాణ 2008ముంబై ఉగ్రదాడిలో ప్రధాన నిందితుడిగా ఉన్నారు. ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొన్నాడన్న ఆరోపణలై రాణాను 2009లో ఎఫ్ బీఐ అరెస్టు చేసింది. అప్పటి నుంచి రాణా అమెరికాలో ఉండిపోయారు. రాణాను భారత్ కు అప్పగించేందుకు అమెరికా కోర్టు 2024లో ఆమోదం తెలిపింది. దీనిపై రాణా వేసిన రివ్యూ పిటిషన్ ను కోర్టు కొట్టివేసింది. ఇటీవల భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటనలో రాణాను భారత్ కు అప్పగించడానికి అధ్యక్షుడు ట్రంప్ ఆమోదం తెలిపారు. దీంతో రాణాను 16ఏళ్ల తర్వాతా తాజాగా భారత్ కు తీసుకవచ్చారు.

**ముంబై దాడి కేసు కొలిక్కి**

2008 ముంబై ఉగ్రదాడికి ముందు రాణాతో పాక్అమెరికా టెర్రరిస్టు డేవిడ్ హెడ్లీ టచ్ లో ఉన్నారు. 26/11దాడికి ముందు హెడ్లీ 8సార్లు ఇండియాకు వచ్చాడని..ఆ సమయంలో 233సార్లు రాణాతో సంప్రదింపులు జరిపాడని విచారణలో తేలింది. లష్కరే తోయిబా కోసం రాణా పనిచేస్తున్నాడు. పాకిస్తాన్ ఇంటర్ సర్వీసెస్ ఇంటలిజెన్స్ తో ఆయనకు సంబంధాలున్నాయి. రాణా రాకతో ముంబై దాడి కేసు కొలిక్కి వచ్చే అవకాశముంది.

# ఏది మంచిది అనిపిస్తే అదే చేస్తా



అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా సతీమణి మిషెల్లీ విడాకుల ప్రచారంపై ఎట్టకేలకు పెదవి విప్పారు. గత కొంతకాలంగా దేశ మాజీ ప్రథమ పౌరురాలి హోదాలో ఆమె పలు అధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రచారాన్ని బహిరంగంగా బరాక్ ఖండించినప్పటికీ.. మిషెల్లీ మాత్రం ఎక్కడా స్పందించకపోవడంతో ఆ అనుమానాలు కొనసాగుతూ వచ్చాయి. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన టైంలో, అంతకు ముందు మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ అంత్యక్రియలకు మిషెల్లీ ఒబామా గైర్హాజరు అయ్యారు. మాజీ అధ్యక్షులు అయినప్పటికీ సతీసమేతంగా (ఫస్ట్ లేడీ కాబట్టి) హాజరు కావడం అక్కడి ఆనవాయితీ. అయితే బరాక్ ఒబామా ఒంటరిగా ఆ కార్యక్రమాలకు హాజరు కావడంతో ఈ జంట విడాకులు తీసుకోబోతోందంటూ ప్రచారం నడిచింది. అయితే ఈ ప్రచారాన్ని ఒబామా గత నాలుగు నెలల కాలంలో విడాకుల రూమర్లనురెండుసార్లు ఖండించారు. ఇప్పుడు మిషెల్లీ ఓ ఇంటర్వ్యూలో ఈ ప్రచారంపై స్పందించారు. నటి సోఫియా బుష్ నిర్వహించే పాడ్‌కాస్ట్‌లో మిషెల్లీ మాట్లాడుతూ.. విడాకుల ప్రచారాన్ని తోసిపుచ్చారు. తన గురించి ఆలోచించే సమయం తనకు ఇప్పటికి దొరికిందని.. అందుకే అధికారిక కార్యక్రమాలకు, రాజకీయపరమైన కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నట్లు ప్రకటించారామె. ‘‘ గత ఎనిమిదేళ్లలో నా జీవితంలో ఎన్నో మార్పులొచ్చాయి. కుమార్తెలు పెద్దవాళ్లు అయ్యారు. నా గురించి ఆలోచించుకోవడానికి ఇప్పటికైనా నాకు సమయం దొరికింది. నాకు ఏది మంచో అదే చేయాలనుకుంటున్నా. అంతేకానీ ఇతరులు ఏమనుకుంటున్నారో అది చేయడం కాదు’’ అని అన్నారామె. ఇక్కడ.. ఒక మహిళకు ఉండే స్వేచ్ఛ కోణంలో ఎవరూ ఆలోచించలేకపోయారు. మహిళలుగా మనం ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఇవే. ఆమె తన కోసం ఆలోచిస్తోందని, తగిన నిర్ణయాలు తీసుకుంటుందని ప్రజలు గ్రహించలేకపోయారు. కేవలం భర్త నుంచి విడిపోతోందనే చర్చించుకున్నారు అని మిషెల్లీ అన్నారు. ఇదిలా ఉంటే.. ఏప్రిల్ 3వ తేదీన హమిల్టన్ కాలేజీలో ఓ ఈవెంట్‌కు హాజరైన బరాక్ ఒబామా తన వైవాహిక జీవితం గురించి మాట్లాడారు. రెండు పర్యాయాలు అమెరికా అధ్యక్షునిగా పదవిలో కొనసాగిన కాలంలో పని ఒత్తిడి కారణంగా భార్యతో సఖ్యత చెడిందని బరాక్ ఒబామా ఒప్పుకున్నారు. నాటి మనస్పర్ధలను తొలగించుకుంటూ నేడు ఆనందంగా జీవిస్తున్నామన్నారు.

# వ్యభిచార గృహాలతో సంబంధాలు

## అమెరికాలో భారత సంతతి సీఈఓ అరెస్ట్




క్లీన్ వాటర్ స్టార్టప్ అయిన 'గ్రాడియంట్' సీఈఓ అనురాగ్ బాజ్‌పేయ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. అమెరికాలో ఉన్నత స్థాయి వ్యభిచార గృహాలతో సంబంధాలు పెట్టుకున్నారనే ఆరోపణలపై ఈయనను అరెస్ట్ చేసినట్లు, బోస్టన్ ఏరియా కోర్టుకు సమర్పించిన పత్రాల్లో అధికారులు వెల్లడించారు. భారత సంతతికి చెందిన అనురాగ్ బాజ్‌పేయ్ మాత్రమే కాకుండా.. వ్యభిచార గృహాల్లో గడిపిన కేసులో వైద్యులు, న్యాయవాదులు, ప్రభుత్వ అధికారులు మొదలైనవారు ఉన్నట్లు తెలుస్తోంది. వీరు మహిళలతో గడపడానికి గంటకు 600 డాలర్లు (రూ. 50వేలు కంటే ఎక్కువ) వెచ్చించేవారు. వీరు ఎంచుకునే మహిళలలో ఎక్కువ మంది.. అక్రమ రవాణాకు గురై వ్యభిచార కూపంలో ఇరుక్కున్నవారే అని భావిస్తున్నారు. వ్యభిచార కుంభకోసం కేసులు తమ బాస్ అరెస్ట్ అవ్వడంతో.. కొందరు ఉద్యోగులు ఆయన తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అయితే గ్రాడియంట్ కంపెనీ మాత్రం ఆయనకు మద్దతుగా నిలిచింది. న్యాయ వ్యవస్థపై విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ.. సమస్య పరిష్కారమవుతుందని భావిస్తున్నామని ఒక ప్రకటనలో వెల్లడించింది.

**ఎవరీ అనురాగ్ బాజ్‌పేయ్?**

అనురాగ్ బాజ్‌పేయి బోస్టన్‌కు చెందిన గ్రేడియంట్ సంస్థకు సహ వ్యవస్థాపకుడు & చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్. ఈ కంపెనీ మురుగు నీటిని శుభ్రం చేస్తుంది. భారతదేశంలో జన్మించిన బాజ్‌పేయ్ క్లీన్‌టెక్ పరిశ్రమలో ప్రముఖ వ్యక్తిగా ఎదిగారు. ఈయన నాయకత్వంలో కంపెనీ సెమీకండక్టర్లు, ఫార్మాస్యూటికల్స్, మైనింగ్, ఫుడ్, డ్రింక్స్ వంటి పరిశ్రమలకు సేవలు అందిస్తోంది. కంపెనీ మొత్తం 25 కంటే ఎక్కువ దేశాలలో 2500 కంటే ఎక్కువ సౌకర్యాలలో కార్యకలాపాలను కొనసాగిస్తోంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో పాఠశాల విద్యను పూర్తి చేసిన బాజ్‌పేయ్ 2006లో మిస్సోరి కొలంబియా విశ్వవిద్యాలయం నుంచి మెకానికల్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ పట్టా పొందారు. ఆ తరువాత ఎంఐటీలో అడ్వాన్స్‌డ్ డిగ్రీలు, 2008లో మాస్టర్ ఆఫ్ సైన్స్, 2012లో మెకానికల్ ఇంజనీరింగ్‌లో PhD పట్టా పొందారు. పరిశోధనల సమయంలో ఈయన పారిశ్రామిక డీశాలినేషన్ & నీటిని శుద్ధి చేయడం వంటి వాటిపై రీసర్చ్ చేశారు.

# ఉక్రెయిన్ ఆరోపణలపై చైనా ఆగ్రహం



**బీజింగ్:** చైనాకు చెందిన కొందరు పౌరులు రష్యాకు మద్దతు పలుకుతూ పోరాడుతున్నారని ఇటీవల ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ చేసిన ఆరోపణలపై చైనా మండిపడింది. తమ దేశ పౌరులు సాయుధ సంఘర్షణ ప్రాంతాలకు దూరంగా ఉండాలని, యుద్ధాల్లో పాల్గొనకుండా ఉండాలని కోరుకుంటుందని పేర్కొంది. జెలెన్‌స్కీ చేసిన వాదనలను తీవ్రంగా ఖండించింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ ఇటీవల.. రష్యా సైన్యంతో కలిసి పోరాడుతున్న ఇద్దరు చైనీస్ పౌరులను తమ సైనికులు పట్టుకున్నారని, దీనిపై చైనా నుంచి వివరణ కోరుతున్నామని అన్నారు. ఈ ఘటన ఉక్రెయిన్‌లోని తూర్పు డొనెట్స్క్ ప్రాంతంలో జరిగినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. అయితే చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ ఈ వాదన పూర్తిగా ఆధారం లేనిదని తోసిపుచ్చారు. చైనా ప్రభుత్వం ఎప్పుడూ కూడా తమ దేశ పౌరులు సాయుధ సంఘర్షణ ప్రాంతాలకు దూరంగా ఉండాలని కోరుతుందని, వారు యుద్ధాల్లో పాల్గొనకుండా చూస్తుందని అన్నారు. జెలెన్‌స్కీ చైనాపై మరిన్ని ఆరోపణలు చేస్తూ..రష్యా తన సోషల్ మీడియా ఖాతాల ద్వారా చైనీస్ పౌరులను తన సైన్యంలో నియమించుకుంటోందని, ఈ విషయం చైనా అధికారులకు తెలుసన్నారు. ఈ రిక్రూట్‌మెంట్‌లో బీజింగ్ నుంచి ఆదేశాలు అందాయా లేదా అనేది తమ దేశం అంచనా వేయగలదన్నారు. కాగా చైనా ప్రతినిధి లిన్ జియాన్ ఈ ఆరోపణలను ఖండిస్తూ, ఉక్రెయిన్ సంక్షోభంపై చైనా స్థితి స్పష్టంగా, స్థిరంగా ఉందని, దీనిని అంతర్జాతీయ సమాజం కూడా గుర్తించిందన్నారు .ఈ వివాదం నడుతున్న తరుణంలో ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రీ సిబిగా, చైనా ఛార్జ్ డి అఫైర్స్‌తో సమావేశమయ్యారు. ఈ ఘటన ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో చైనాకి ఉన్న బాధ్యతాయుతమైన స్థానాన్ని దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి టామీ బ్రూస్ మాట్లాడుతూ ఈ నివేదికలను ఆందోళనకరమని పేర్కొన్నారు. ఈ పరిణామాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. కాగా చైనా తమ దేశం యుద్ధం విషయంలో తటస్థంగా ఉందని, రష్యా లేదా ఉక్రెయిన్‌కు ఆయుధ సాయం అందించడం లేదని స్పష్టం చేసింది.

# జాక్ మూవీ హిట్టా? ఫట్టా?

**డీజే టిల్లు, టిల్లు స్క్వేర్ చిత్రాలతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకొని ఫుల్ జోష్‌లో ఉన్నాడు స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డt. హ్యాట్రిక్ హిట్ కోసం బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో రొమాంటిక్ కామెడీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జాక్'తో నేడు(ఏప్రిల్ 10) ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. మరి సిద్ధు ఖాతాలో హ్యాట్రిక్ హిట్ పడిందా లేదా రివ్యూలో చూద్దాం.**




**కథేంటంటే..**

పాబ్లో నెరుడా అలియాస్ జాక్ (సిద్ధు జొన్నలగడ్డ) రా (రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్) ఏజెంట్ కావాలని కలలు కంటాడు. తనకున్న టాలెంట్ అంతా ఉపయోగించి ఇంటర్వ్యూ వరకు వెళ్తాడు. ఆ రిజల్ట్ రాకముందే ఖాళీగా ఉండడం ఎందుకని దేశాన్ని కాపాడేందుకు రంగంలోకి దిగుతాడు. ఉగ్రవాదులు, హైదారాబాద్‌తో పాటు భారత్‌లోని ఇతర ప్రధాన నగరాల్లో విధ్వంసం సృష్టించేందుకు ప్లాన్ చేస్తున్నారనే విషయం తెలుసుకొని వారిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తాడు. మరోవైపు జాక్ ఏం పని చేస్తున్నాడో కనుక్కోమని ప్రైవేట్ డిటెక్టివ్ అఫిషాన్ బేగం (వైష్ణవి చైతన్య)కు లక్ష రూపాయలు ఇస్తాడు అతని తండ్రి పాన్ ఇండియా ప్రసాద్(నరేశ్). అఫిషాన్ బేగం భానుమతి పేరుతో జాక్‌కి దగ్గరై జాక్ పనిపై నిఘా పెడుతుంది. టెర్రరిస్టులను పట్టుకునే క్రమంలో పొరపాటున 'రా'ఏజెంట్ మనోజ్ (ప్రకాశ్ రాజ్)ని కిడ్నాప్ చేస్తాడు జాక్. ఆ తర్వాత ఏం జరిగింది? టెర్రరిస్ట్ గ్యాంగ్‌ని జాక్ పట్టుకోగలిగాడా లేదా? అసలు జాక్ 'రా' ఏజెంట్ కావాలని ఎందుకు అనుకున్నాడు? చివరకు తను కోరుకున్న ఉద్యోగం పొందగలిగాడా లేదా? అనేదే తెలియాలంటే జాక్(Jack Movie Review) సినిమా చూడాల్సిందే.

**ఎలా ఉందంటే..**

ఒక శిలై ఉన్నానని భూమి కుంగునా?
నేనొక శిల్పానని దైవం తుళ్లునా?
మలిచిన శిల్పం, మలచని రాయి ఈ రెంటిలోన గొప్పది ..శిల్పమా? శిలా?
ఏ జవాబు అందినా పోరు ఆగేదేనా..? రెండిటి మధ్యన..!.. సినిమా ఎండింగ్‌లో బొమ్మరిల్లు భాస్కర్ చెప్పిన 'రాయి - శిల్పం' థియరీ ఇది. ఇందులో నిజంగానే ఏది గొప్పదో చెప్పలేం కానీ ఈ సినిమా విషయంలో మాత్రం శిల్పి(దర్శకుడు) లోపం చాలానే ఉంది. మంచి రాయి( హీరో) ఉన్నప్పటికీ దాన్ని అందమైన శిల్పంగా మార్చడంలో తడబడ్డాడు.

బొమ్మరిల్లు భాస్కర్ తన స్టైల్ కథను పక్కకు పెట్టి తీసిన సినిమా ఇది. ఇంట్రెస్టింగ్ పాయింట్ రాసుకున్నాడు. హీరో పాత్రను కూడా ఆసక్తికరంగానే తీర్చిదిద్దాడు. కానీ కథనం విషయంలో జాగ్రత్త పడలేదు. దేశానికి ముందుడి ప్రమాదం రాకుండా ఆపేదే 'రా' అంటూ 'రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్' గురించి గొప్పగా చెప్పిన భాస్కర్.. కథలో మాత్రం 'రా' ఏజెంట్లను కమెడియన్ల కంటే తక్కువ చేసి చూపించారు. 'రా', ఉగ్రవాదం ..ఇలాంటి కథలను సీరియస్‌గా చెప్తేనే ఆసక్తికరంగా ఉంటుంది. కానీ భాస్కర్ సీరియస్ సబ్జెక్ట్ ఎంచుకొని దానికి కామెడీ టచ్ ఇచ్చాడు. ఇది పూర్తిగా సఫలం కాలేదు. మదర్ సెంటిమెంట్ ఉన్నప్పటికీ.. దాన్ని పూర్తిగా వాడుకోలేకపోయాడు. 'వీడు కొంచెం క్రాక్' అని సినిమాకు పెట్టిన ట్యాగ్‌లైన్‌కు తగ్గట్టుగానే హీరో క్యారెక్టర్‌ని మలిచాడు. ఫస్టాఫ్ అంతా ఫన్‌వేలో నడుస్తుంది. ఉగ్రవాదులను పట్టుకునేందుకు హీరో చేసే ప్రయత్నం క్రాక్‌గానే అనిపిస్తుంది. ఫస్టాఫ్‌లో బలమైన సన్నివేశాలు లేనప్పటికీ స్క్రీన్‌ప్లేతో నెట్టుకొచ్చాడు. ఇంటర్వెల్ సీన్ అయితే మరీ సిల్లీగా అనిపిస్తుంది. ఇక సెకండాఫ్‌లో కథనం కాస్త ఆసక్తికరంగా సాగుతుంది. నేపాల్ ఎపిసోడ్ కొంతమేర ఆకట్టుకున్నా.. టెర్రరిస్టులతో జరిగే యాక్షన్ డ్రామా రక్తికట్టించదు. బలమైన కథ లేకపోవడంతో ముగింపు కూడా రొటీన్‌గానే ఉంటుంది. బొమ్మరిల్లు భాస్కర్ ఈ శిల్పాన్ని మరింత అందంగా చెక్కాల్సింది.

## ఎవరెలా చేశారంటే..

డీజే టిల్లు, టిల్లు స్క్వేర్ చిత్రాలతో యూత్‌ని ఆకట్టుకున్న సిద్ధు..మరోసారి తనదైన నటనతో ఆకట్టుకున్నాడు. కొంచెం క్రాక్ ఉన్న జాక్ పాత్రకు న్యాయం చేశాడు. తెరపై స్టైలిష్‌గా కనిపించాడు. క్లైమాక్స్‌లో ఫైట్ కూడా చేశాడు. అయితే జాక్ మాటలు, బిహేవియర్ చూస్తే 'టిల్లు' వద్దన్నా గుర్తుకు వస్తాడు. వైష్ణవి చైతన్య కు స్క్రీన్ స్పేస్ ఎక్కువే ఉన్నప్పటికీ ఆమె పాత్రకు అంతగా ప్రాధాన్యత ఉండదు. నటన పరంగాను మెప్పించడానికి అక్కడ స్కోప్ లేదు. ఏదో హీరోయిన్ ఉండాలి కాబట్టి ఆ క్యారెక్టర్‌ని డిజైన్ చేశారు. 'రా' ఏజెంట్ మనోజ్‌గా ప్రకాశ్ రాజ్ తనదైన నటనతో ఆకట్టుకున్నాడు. అయితే ఆయన పాత్రను అటు సీరియస్‌గాను..ఇటు పూర్తి కమెడియన్‌గాను మల్చలేక రెండింటికి మధ్య ఊగిసలాడేలా తీర్చిదిద్దారు. సుబ్బరాజు పాత్ర కూడా అంతే. మిగిలిన నటీనటులు తమ పాత్రల పరిధిమేర నటించారు. సాంకేతికంగా సినిమా పర్వాలేదు. పాటలు అంతగా గుర్తుపెట్టుకునేలా ఉండవు కానీ నేపథ్య సంగీతం ఓకే. సినిమాటోగ్రఫీ బాగుంది. ఎడిటర్ తన కత్తెరకు బాగా పని చెప్పాల్సింది. నిర్మాణ విలువలు సినిమా స్థాయికి తగ్గట్టు ఉన్నతంగా ఉన్నాయి.

## రామ్‌చరణ్ నాకు చాలా క్లోజ్.. సత్య కాళ్లు మొక్కిన గ్లోబల్ స్టార్




బుల్లితెర యాంకర్ ప్రదీప్ మాచిరాజు ఆచితూచి సినిమాలు చేస్తున్నాడు. ఈసారి అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి మూవీతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఏప్రిల్ 11న ఈ చిత్రం విడుదల కానుంది. దీంతో చిత్రయూనిట్ ప్రమోషన్స్ స్పీడు పెంచింది. తాజాగా ఈ మూవీకి సపోర్ట్ చేసేందుకు గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ ముందుకు వచ్చాడు.

**గ్లోబల్ స్టార్‌కు ఫస్ట్ టికెట్**

ఇందుకు సంబంధించిన ఓ సరదా వీడియోను చిత్ర యూనిట్ విడుదల చేసింది. అందులో ప్రదీప్.. ఫస్ట్ డే మార్నింగ్ షో.. ఫస్ట్ టిక్కెట్టు గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్‌కు ఇవ్వాలనుకుంటున్నట్లు వెల్లడించాడు. అది విన్న సత్య.. రామ్‌చరణ్ తనకు చాలా క్లోజ్.. నేను ఏది చెప్తే అంత అంటూ బిల్డప్ కొట్టాడు.

**చివర్లో మాత్రం..**

చివరకు చరణ్ ఎంట్రీ ఇచ్చి సత్యను చూసి ఎవరీ అబ్బాయి అనడంతో అతడి పరువు పోయినట్లయింది. చివర్లో మాత్రం సత్యను గుర్తుపట్టి పెద్ది షూటింగ్‌కు సమయానికి వచ్చేయ్ అన్నాడు. అనంతరం సత్య.. చెర్రీ కాళ్లు మొక్కగా అతడు కూడా తిరిగి పాదాలకు నమస్కరించడం విశేషం. తర్వాత చరణ్.. అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి సినిమా ఫస్ట్ టికెట్‌ను కొనుగోలు చేశాడు. ఇది చూసిన అభిమానులు అంత పెద్ద స్టార్ అయ్యుండి ఇంత సింపుల్‌గా ఉండటం చాలా గ్రేట్ అని కామెంట్లు చేస్తున్నారు.

## కాబోయే భార్యతో బీచ్ ఒడ్డున అఖిల్ ప్రేమ పరవశం..




అక్కినేని అఖిల్ మరి కొద్ది రోజులలో పెళ్లి పీటలు ఎక్కబోతున్నాడు. గతంలో ఓ అమ్మాయితో నిశ్చితార్థం చేసుకున్న అఖిల్ అనుకోని కారణాల వలన ఆమెకి బ్రేకప్ చెప్పాడు. ఇప్పుడు జైనబ్ రబ్జీ అనే యువతిని పెళ్లి చేసుకోనున్నాడు. వీరి పెళ్లికి సంబంధించి గత కొద్ది రోజులుగా అనేక ప్రచారాలు జరుగుతున్నా కూడా దానిపై క్లారిటీ అనేది రావడం లేదు. అయితే తాజాగా అఖిల్ తనకి కాబోయే భార్య జైనాబ్ రవ్జీతో కలిసి బీచ్ సైడ్‌లో ఓ ఫొటో దిగగా, ఈ పిక్ ఇప్పుడు నెట్టింట తెగ హల్‌చల్ చేస్తుంది. ఈ పిక్‌పై నా సర్వస్వం అని రాసి ఉంది. ఇది అందరిని ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఈ పిక్ చూసిన వారందరు కూడా జంటని తెగ పొగిడేస్తున్నారు. ఇక ఇదిలా ఉంటే అఖిల్ పెళ్లి ఎప్పుడా అని అక్కినేని అభిమానులు ఎదురు చూస్తున్నారు. ఇటీవలి కాలంలో అఖిల్, జైనాబ్ తరచు బయట కనిపిస్తున్న నేపథ్యంలో వారిద్దరు త్వరలోనే పెళ్లి చేసుకోనున్నారని అంటున్నారు. ఇప్పుడు అఖిల్ వ్యక్తిగతంగా ఎంతో హ్యాపీగా కనిపిస్తున్నాడు. త్వరలో వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టనున్నాడు. అలానే ఓ మంచి సినిమా కూడా అఖిల్ ఖాతాలో పడితే మనోడికి ఇక తిరుగు ఉండదు. గత చిత్రం 'ఏజెంట్' ఆశించిన స్థాయిలో సక్సెస్ కాకపోవడంతో కొంత గ్యాప్ తీసుకున్నాడు. ఇప్పుడు మళ్లీ లెనిన్ అనే టైటిల్‌తో ఓ కొత్త ప్రయోగాత్మక సినిమా చేస్తున్నాడు. ఈ చిత్రానికి 'వినరో భాగ్యము విష్ణు కథ' ఫేమ్ మురళీ కిషోర్ దర్శకత్వం వహించనున్నాడు. గ్రామీణ నేపథ్యంలో రూపుద్దుకుంటున్న ఈ సినిమాలో శ్రీలీల హీరోయిన్ గా నటిస్తోంది. ఇక అఖిల్ చేసుకోబోయ్ అమ్మాయి జైనబ్ విషయానికి వస్తే.. ఈమె సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ . ఇండియాలోనే కాకుండా దుబాయ్ లండన్ లోను ఆర్టిస్ట్ గా ఆమెకు మంచి పేరు ఉంది. ఆమె వేసే పెయింటింగ్స్‌కి ఇంటర్నేషనల్ లెవల్ లో ప్రశంసలు కూడా దక్కాయి. జుల్ఫీ రావ్‌డ్జీ కుమార్తెనే జైనబ్. ఆయన రియల్ ఎస్టేట్ టైకూన్. నిర్మాణ పరిశ్రమలో ఆయనకు 30 ఏళ్లకి పైగా అనుభవం ఉంది. జగన్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సలహాదారుగా కూడా పనిచేశారు.

# క్రీడా వార్తలు | SPORTS NEWS

## పృథ్వీ షాకు బంపరాఫర్
### ధోని టీమ్‌లోకి వైల్డ్ కార్డ్ ఎంట్రీ!?



చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ గాయం కారణంగా ఐపీఎల్ 2025 సీజన్ నుంచి వైదొలిగాడు. రుతురాజ్ స్థానంలో సీఎస్‌కే కెప్టెన్‌గా స్టార్ వికెట్ కీపర్ ఎంఎస్ ధోని బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. ఈ విషయాన్ని సీఎస్‌కే గురువారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. అయితే వరుస ఓటములతో సతమతమవుతున్న చెన్నైకి ఇప్పుడు గైక్వాడ్ దూరం కావడం నిజంగా గట్టి ఎదురు దెబ్బ అనే చెప్పాలి. ఈ క్రమంలో గైక్వాడ్ స్థానాన్ని భర్తీ చేసే పనిలో సీఎస్‌కే మెనెజ్‌మెంట్ పడింది. టీమిండియా ఓపెనర్, ముంబై స్టార్ ప్లేయర్ పృథ్వీ షాని తీసుకోవడానికి చెన్నై సూపర్ కింగ్స్ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్‌లో కొన్ని సీజన్ల పాటు ఓ వెలుగు వెలిగిన పృథ్వీ షా.. తొలిసారి ఈ క్యాష్ రిచ్ లీగ్‌కు దూరంగా ఉన్నాడు. ఐపీఎల్ 2025 మెగా వేలంలో పృథ్వీ అన్‌సోల్డ్‌గా మిగిలిపోయాడు. రూ.75 లక్షల కనీస ధరతో వేలంలోకి వచ్చిన అతడిని ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపలేదు. ప్రస్తుతం ఫామ్ లేమి, ఫిట్‌నెస్ సమస్యలతో సతమతవుతున్నందున షాను ఏ ఫ్రాంచైజీ కూడా సొంతం చేసునేందుకు ముందుకు రాలేదు. తన ఐపీఎల్ అరంగేట్రం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ సైతం అతడిని తిరిగి సొంతం చేసుకునేందుకు కనీస ప్రయత్నం చేయలేదు. అయితే మరోసారి పృథ్వీ షాకు రుతురాజ్ గాయం రూపంలో అవకాశం లభించే సూచనలు కన్పిస్తున్నాయి. ఐపీఎల్‌లో ఇప్పటివరకు 79 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన షా.. 147.47 స్ట్రైక్ రేట్‌తో 1,892 పరుగులు చేశాడు. అందులో 14 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

## దంచికొట్టిన కేఎల్ రాహుల్..
## ఢిల్లీ క్యాపిటల్స్ జైత్రయాత్ర





**బెంగళూరు:** ఐపీఎల్ 18లో ఢిల్లీ క్యాపిటల్స్ జైత్రయాత్ర కొనసాగిస్తోంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 6 వికెట్ల తేడాతో నెగ్గింది. తొలుత ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ఢిల్లీ 17.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కేఎల్ రాహుల్ (93*: 53 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్స్‌లు) దంచికొట్టాడు. స్టబ్స్ (38*: 23 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్స్) రాణించాడు. బెంగళూరు బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ 2, యశ్ దయాల్, సుయాశ్ శర్మ ఒక్కో వికెట్ తీశారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (37; 17 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), విరాట్ కోహ్లీ (22; 14 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు. రజత్ పటీదార్ (25), కృనాల్ పాండ్య (18) పరుగులు చేశారు. చివర్లో టిమ్ డేవిడ్ (37*; 20 బంతుల్లో 2 ఫోర్, 4 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. ఢిల్లీ బౌలర్లలో విప్రాజ్ నిగమ్ 2, కుల్‌దీప్ యాదవ్ 2, ముకేశ్ కుమార్, మోహిత్ శర్మ చెరో వికెట్ పడగొట్టారు.

## చరిత్ర సృష్టించిన విరాట్ కోహ్లి..



టీమిండియా స్టార్ ప్లేయర్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లి తన రికార్డుల వేటను కొనసాగిస్తున్నాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (IPL) చరిత్రలో 1,000 ఫోర్లు బౌండరీలు బాదిన తొలి ప్లేయర్‌గా విరాట్ రికార్డులకెక్కాడు. ఐపీఎల్ 2025లో భాగంగా చిన్నస్వామి స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కింగ్ కోహ్లి ఈ రేర్ ఫీట్‌ను సాధించాడు. కోహ్లి ఇప్పటివరకు ఐపీఎల్‌లో 249 మ్యాచ్‌లు ఆడి 1001 బౌండరీలు బాదాడు. అందులో 721 ఫోర్లు, 280 సిక్సర్లు ఉన్నాయి. కోహ్లి తర్వాతి స్థానంలో టీమిండియా మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్(920) ఉన్నాడు. ఇక ఈ మ్యాచ్‌లో కోహ్లి ఫర్వాలేదన్పించాడు. 14 బంతుల్లో 1 ఫోర్లు, 2 సిక్స్‌లతో 22 పరుగులు చేశాడు. అదే విధంగా ఐపీఎల్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన భారత ఆటగాడిగా రికార్డు సృష్టించేందుకు కోహ్లి కేవలం మూడు సిక్సర్ల దూరంలో ఉన్నాడు. కోహ్లి ఇప్పటివరకు 249 ఇన్నింగ్స్‌ల్లో 280 సిక్సర్ల బాదాడు. మరో మూడు సిక్సర్లు కొడితే భారత కెప్టెన్ రోహిత్ శర్మను కోహ్లి అధిగమిస్తాడు. రోహిత్ ఐపీఎల్‌లో 256 ఇన్నింగ్స్‌ల్లో 282 సిక్సర్లు బాదాడు.

## ముదురుతున్న ఈడెన్ పిచ్ వివాదం



కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ మైదానం ఐపీఎల్‌లో కేకేఆర్ ఫ్రాంచైజీకి సొంత మైదానమన్న విషయం తెలిసిందే. అయితే ఈ సీజన్‌లో ఆ జట్టుకు హోం అడ్వాంటేజ్ అన్నదే లేకుండా పోయింది. ఇక్కడ ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఓడింది. దీనికి కారణం అక్కడి పిచ్ అని కేకేఆర్ సారథి అజింక్య రహానే బహిరంగంగా అసంతృప్తిని వ్యక్తం చేశాడు. పిచ్‌ను స్పిన్‌కు అనుకూలంగా మార్చమని ఈడెన్ క్యూరేటర్ సుజన్ ముఖర్జీని ఎన్ని సార్లు అడిగినా పట్టించుకోవడం లేదని అన్నాడు. తాజాగా ఈడెన్‌లో కేకేఆర్ లక్నో సూపర్ జెయింట్స్ చేతిలో నాలుగు పరుగుల స్వల్ప తేడాతో ఓడిపోయింది. ఈ ఓటమికి కూడా పిచ్చే కారణమని రహానే సహ కేకేఆర్ యాజమాన్యం భావిస్తుంది. ఈ ఓటమి తర్వాత కేకేఆర్‌కు చెందిన ఓ కీలక అధికారి బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ (CAB) సభ్యులతో భేటీ అయ్యారు. ఈ భేటీలో పిచ్‌పై తీవ్ర స్థాయిలో చర్చ జరిగినట్లు తెలుస్తుంది. ఈ సందర్భంగా సదరు కేకేఆర్ అధికారి ఓ క్యాబ్ సభ్యుడితో వ్యంగ్యంగా చర్చించినట్లు తెలుస్తుంది.

**ముదురుతున్న వివాదం**

బెంగాలీ వార్తా పత్రిక సంగ్బాద్ ప్రతిదిన్ నివేదిక ప్రకారం.. ఈడెన్ పిచ్‌పై క్యూరేటర్ సుజన్ ముఖర్జీ, కేకేఆర్ యాజమాన్యం మధ్య వివాదం ముదురుతున్నట్లు తెలుస్తుంది. లక్నో చేతిలో ఓటమి అనంతరం ఓ కేకేఆర్ అధికారి ఈడెన్ పిచ్ క్యూరేటర్‌ను ఉద్దేశిస్తూ.. అతడికి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు ఇవ్వాల్సిందని వ్యంగ్యంగా అన్నట్లు సమాచారం. లక్నోతో మ్యాచ్ అనంతరం కేకేఆర్ సారథి రహానే కూడా క్యూరేటర్ సుజన్ ముఖర్జీని టార్గెట్ చేసే ప్రయత్నం చేశాడు. అయితే వివాదం పెద్దమవడం ఇష్టం లేక వదిలిపెట్టినట్లున్నాడు. సుజన్ ఇదివరకే మీడియా ప్రచారం పొందారని రహానే ఆ సందర్భంగా అన్నాడు. పిచ్ విషయాన్ని పక్కన పెడితే.. ఈ సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన కేకేఆర్ ఇప్పటివరకు ఆడిన 5 మ్యాచ్‌ల్లో మూడింట ఓడి పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో ఉంది. కేకేఆర్ ఓడిన మూడు మ్యాచ్‌లు హోం గ్రౌండ్ ఈడెన్‌లో ఓడినవే కావడం విశేషం. కేకేఆర్ తమ తదుపరి మ్యాచ్‌లో రేపు (ఏప్రిల్ 11) సీఎస్‌కేను ఢీకొట్టనుంది. ఈ మ్యాచ్ చెన్నైలోని చెపాక్ స్టేడియంలో జరుగనుంది.

**సీఎస్‌కేతో మ్యాచ్‌కు కేకేఆర్ జట్టు (అంచనా)..**

డికాక్ (వికెట్‌కీపర్), సునీల్ నరైన్, అజింక్య రహానే (కెప్టెన్), వెంకటేశ్ అయ్యర్, రమణ్‌దీప్ సింగ్, రఘువంశీ, రసెల్, రింకూ సింగ్, హర్షిత్ రాణా, స్పెన్సన్ జాన్సన్, వైభవ్ అరోరా, వరుణ్ చక్రవర్తి

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com